
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా వార్తలు

బుధవారం 7 ఫిబ్రవరి 2024





మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్

కట్టుదిట్టంగా ఇంటర్, టెన్త్ పరీక్షలు

- ఎలాంటి ఇబ్బందులు రానీయొద్దంటూ కలెక్టర్ ఆదేశం

నెల్లూరు (విద్య), ఫిబ్రవరి 6 : జిల్లాలో ఇంటర్, పదోతరగతి పబ్లిక్ పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం నగరంలోని కలెక్టరేట్‌లో టెన్త్, ఇంటర్ పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించి మాట్లాడారు. మార్చి 1 నుంచి 20వ తేదీ వరకు ఇంటర్ పరీక్షలు జరుగుతాయన్నారు. కొత్త జిల్లావ్యాప్తంగా 81 కేంద్రాల్లో జరిగే పరీక్షలకు ప్రథమ సంవత్సరం 25,202, ద్వితీయ సంవత్సరం 24,243, ఒకేషనల్ 2,631 మంది కలిపి 52,076 మంది విద్యార్థులు హాజరవుతారని అన్నారు. అలాగే మార్చి 18 నుంచి 30వతేదీ వరకు జరిగే 32,384 మంది విద్యార్థులు టెన్త్ పరీక్షలు రాయనున్నారని చెప్పారు. ఈ పరీక్షలను కోఆర్డినేషన్ కమిటీ సభ్యులు సమన్వయం చేసుకుంటూ ఎలాంటి ఇబ్బందులు తెలెత్తకుండా అన్ని జాగ్రత్తలతో నిర్వహించాలని ఆదేశించారు. పోలీసుశాఖ ద్వారా గట్టి బందోబస్తును ఏర్పాటు చేయడంతోపాటు 144 సెక్షన్ అమలు చేయాలని సూచించారు. కేంద్రాల్లో మంచినీటి వసతి, మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచేందుకు ఆయా మునిసిపాలిటీల ద్వారా శానిటేషన్ పనులు చేయించాలన్నారు. విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా ఆర్టీసీ బస్సులు నడపాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రాల్లో గుర్తింపు పొందిన అధికారులు మాత్రమే ఉండాలని, ఇతర వ్యక్తులు ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో కార్పొరేషన్ కమిషనర్ వికాస్‌మర్మత్, అదనపు కమిషనర్ శర్మద, డీఆర్‌ఓ లవన్న, ఏఎస్పీ శ్రీనివాసులు, డీటీసీ చందర్, ఆర్ఐఓ ఎ.శ్రీనివాసులు, డీఈఓ గంగాభవాని తదితరులు పాల్గొన్నారు.

- పిల్లల్లో నులిపురుగులను నివారించండి

నెల్లూరు (వైద్యం) : పిల్లల్లో నులిపురుగుల నివారణకు గట్టి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హరినారాయణన్ వైద్యాధికారులను ఆదేశించారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో ఈ నెల 9వ తేదీన జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంపై చేపట్టాల్సిన చర్యల గురించి వైద్యాధికారులతో ఆయన సమీక్షించారు. జిల్లావ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 100 శాతం లక్ష్యాలను సాధించేలా కృషి చేయాలని సూచించారు. డీఈవో, ఆర్ఐవో, ఐసీడీఎస్ పీడీ ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు రాని 1 నుంచి 2 ఏళ్ల చిన్నారులకు ఆశాలు, ఏఎన్ఎంలు ఇంటికి వెళ్లి మాత్రలు మింగించాలని ఆదేశించారు. అనంతరం నులిపురుగుల గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సమీక్షలో కార్పొరేషన్ కమిషనర్ వికాస్ మర్మత్, డీపీవో సుస్మిత, డీఈవో గంగాభవాని, ఆర్ఐవో శ్రీనివాసులు, డీఎంహెచ్‌వో పెంచలయ్య, డీసీహెచ్ఎస్ రమేష్‌నాథ్, సీడీపీవో అనూరాధ, వైద్యాధికారి సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

డీఈఓ గంగాభవానికి పదోన్నతి

వయోజన విద్య జేడీగా నియామకం ● కొత్త డీఈవోగా రామారావు



నెల్లూరు (విద్య) : జిల్లా విద్యాశాఖాధికారి ఆర్ఎస్ గంగాభవానికి ఇటీవల ఆర్‌జేడీగా పదోన్నతి లభించడంతో ఆమెను ఫారెన్ సర్వీస్ కింద డిప్యుటేషన్ ప్రాతిపదికన వయోజన విద్య జాయింట్ డైరెక్టర్‌గా, వయోజన విద్య డైరెక్టర్ ఇన్చార్జిగా నియమిస్తూ పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ప్రవీణ్ ప్రకాష్ మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. కొత్త డీఈవోగా పీజేవీ రామారావు నియమితులయ్యారు. గుంటూరు జిల్లాకు చెందిన రామారావు ప్రస్తుతం బాపట్ల జిల్లా ఏడీ-1గా పనిచేస్తూ ఇన్చార్జి డీఈఓగా ఉన్నారు. మరో రెండు రోజుల్లో ఆయన జిల్లాలో బాధ్యతలు స్వీకరించనున్నారు. అలాగే జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో ఏడీ-1గా పనిచేస్తున్న కె.నారాయణరావును జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి(డీఎస్ఈఓ)గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా డీఈఓల బదిలీలతో పాటు నూతనంగా డీఎస్ఈఓ పోస్టుల్లో కూడా నియామకాలు చేపట్టారు.



పోర్టు పనులు జరగకుండా ఆందోళన చేస్తున్న కర్లపాలెం గ్రామస్థులు

ప్యాకేజీ ఇస్తారా.. ఖాళీ చేస్తారా!?


- పోర్టు ప్రతినిధులను నిలదీసిన కర్లపాలెం గ్రామస్థులు

గుడ్లూరు, ఫిబ్రవరి 6 : కర్లపాలెం గ్రామాన్ని వెంటనే ఖాళీ చేయాలని, లేని పక్షంలో వెంటనే ప్యాకేజీ ఇవ్వాలని రామాయపట్నం పోర్టు ప్రతినిదులను ఆ గ్రామస్థులు నిలదీశారు. ఇళ్ల స్థలాల కేటాయింపులో అధికారులు నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తున్నారని మండిపడ్డారు. తమ సమస్యల పరిష్కారం కోసం కర్లపాలెం గ్రామస్థులు రెండవ రోజు మంగళవారం కూడా పోర్టు పనులను అడ్డుకున్నారు. సాయంత్రం 4 గంటల ప్రాంతంలో పోర్టు అధికారులు ఐవీ రెడ్డి, ప్రతాప్‌కుమార్ రెడ్డి ఆందోళనకారులతో చర్చించారు. అయితే, తమ సమస్యల పరిష్కారంపై పూర్తి స్థాయిలో హామీ ఇస్తేనే అక్కడనుంచి కదులుతామని భీష్మించారు. దీంతో చేసేది లేక జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతామనింటూ వెనుదిరిగారు. వీరి ఆందోళనకు సీఐటీయూ జిల్లా కార్యదర్శి గంటెనపల్లి వెంకటేశ్వర్లు మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కర్లపాలెం సర్పంచ్ చాపల రమణయ్య, చాపల మీరయ్య, బాలాజీ, వెంకట్, శ్రీను, సుబ్బరాయుడు, సుబ్బారావు, సుశీల, సుజాత, మస్తానమ్మ, శ్యామల, దుర్గా, వెంకటేశ్వరమ్మ, నూతలపాటి వెంకటేశ్వర్లు, ఇ. ఉపేంద్ర, ఆవులవారిపాలెం కాపు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కాసులు కురిసేనా!?

భారీగా బిల్లుల పెండింగ్.. కదలని అభివృద్ధి పనులు ● నేడు ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ ● వేయికళ్లతో ఎదురుచూస్తున్న కాంట్రాక్టర్లు

జిల్లాలో అభివృద్ధి పడకేసింది. కొత్త పనుల మంజూరు దేవుడెరుగు కనీసం పాత పనులనైనా పూర్తి చేయలేని దుస్థితి నెలకొంది. చిన్న ప్యాచ్ వర్కుల నుంచి పెద్ద ప్రాజెక్టుల వరకు ఎక్కడికక్కడ ఆగిపోయాయి. కాంట్రాక్టర్లు సొంత డబ్బులతో పనులు చేసినా బిల్లులు ఇవ్వకపోవడంతో పనులు చేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. చిన్న కాంట్రాక్టర్ నుంచి బడా కాంట్రాక్టర్ వరకు ప్రతి ఒక్కరూ ఆర్థికంగా చితికిపోయారు. పెండింగ్ బిల్లుల కోసం కాంట్రాక్టర్లు ఆందోళనలు చేస్తున్నా.. కోర్టులను ఆశ్రయి స్తున్నా ప్రభుత్వంలో చలనం లేదు. పైగా వైసీపీ ప్రజాప్రతినిధులే సమావేశాల్లో గగ్గోలు పెడుతున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదు. ఈ పరిస్థితుల్లో వైసీపీ ప్రభుత్వం చివరి బడ్జెట్‌ను రాష్ట్ర శాసనసభలో బుధవారం ప్రవేశపెట్టనుంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌ను రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రవేశపెట్టనున్నారు. ఈసారైనా పెండింగ్ బిల్లులకు బడ్జెట్ కేటాయిస్తారా? అభివృద్ధి పనులకు మోక్షం లభిస్తుందా..? అని జిల్లావాసులు గంపెడు ఆశలతో ఎదురుచూస్తున్నారు.



నెల్లూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : 2020, 2021 సంవత్సరాల్లో వరుసగా సంభవించిన వరదలకు సోమశిల ప్రాజెక్టు ఆప్రాన్ పూర్తిగా దెబ్బతిన్నది. దీనిని పరిశీలించిన నిపుణుల బృందం అత్యవసరంగా ఆప్రాన్ పనులు పూర్తి చేయాలని సూచించింది. దీంతో రూ.117 కోట్లతో రెండేళ్ల క్రితం పనులు మొదలయ్యాయి. కానీ 20 శాతం పనులు జరిగాక ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదు. ఫలితంగా కాంట్రాక్టర్ పనులు ఆపేశారు. దీంతో సోమశిల ప్రాజెక్టు ప్రమాదంలో పడింది. నెల్లూరు నగరంలో రూ.75 కోట్ల అగ్రిమెంట్ విలువతో జాఫర్ సాహెబ్ కెనాల్ ఆధునికీకరణ చేపట్టగా 15 శాతం పనులు పూర్తయ్యాయి. కానీ ఒక్క రూపాయి కూడా కాంట్రాక్టర్‌కు బిల్లు రాకపోవడంతో ఏడాది నుంచి పనులు ఆగిపోయాయి. మలిదేవి డ్రెయిన్ ఆధునికీకరణ పనులు రూ.70 కోట్లతో మొదలవగా 50 శాతం పూర్తయ్యాయి. కానీ మూడేళ్ల నుంచి రూపాయి బిల్లు రాక ఆ తర్వాత పనులు ముందుకు కదలడం లేదు. సోమశిల హైలెవల్ కెనాల్ పనులు రూ.1502 కోట్లతో, ఎస్‌కేఎఫ్ఎఫ్, ఉత్తర కాలువల విస్తరణ పనులు రూ.1300 కోట్లతో మొదలయ్యాయి. ఇక్కడా బిల్లుల సమస్యతో ఒక అడుగు ముందుకు మూడడుగులు వెనక్కు అన్న చందంగా పనులు జరుగుతున్నాయి.

- 541 రైతు భరోసా కేంద్రాల భవనాల నిర్మాణాన్ని రూ.118 కోట్లతో చేపట్టగా నాలుగేళ్లలో 257 కేంద్రాలు మాత్రమే పూర్తయ్యాయి. అలానే 455 గ్రామ ఆరోగ్య కేంద్రాలను రూ.94 కోట్లతో చేపట్టగా 153 కేంద్రాలు పూర్తయ్యాయి. రూ.15 కోట్లతో 86 పాల శీతలీకరణ కేంద్రాల నిర్మాణం చేపట్టగా 7 మాత్రమే పూర్తయ్యాయి. నాలుగేళ్లుగా ఈ చిన్న భవనాలు కూడా పూర్తికాకపోవడానికి ప్రధాన కారణం బిల్లులు ఇవ్వకపోవడమేనని అధికారులే చెబుతుండడం గమనార్హం.



సోమశిల ముందు దెబ్బతిన్న ఆప్రాన్ (ఫైల్)

- ఇక రోడ్ల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. రోడ్డు మొత్తాన్ని అభివృద్ధి చేయడం అటుంచితే కనీసం ప్యాచ్‌లు వేసేందుకు కూడా నిధులు ఇవ్వడం లేదు. ఎన్‌డీబీ, ఏఐఐబీ వంటి ప్రాజెక్టులు బిల్లులు ఇవ్వకపోవడంతో ముందుకు కదలడం లేదు. ఇటీవల ఐప్యాక్ సర్వే సంస్థ అత్యవసరంగా మరమ్మతులు చేయాలని 28 రోడ్లను సూచించగా వాటిని రూ.86 కోట్ల అంచనాలతో చేపట్టారు. పెండింగ్ బిల్లులు ఇస్తామని హామీ ఇచ్చి ఐప్యాక్ వర్కులకు కాంట్రాక్టర్ల నుంచి టెండర్లు వేయించారు. కానీ ఆ తర్వాత బిల్లులు ఇవ్వకపోవడంతో ఈ వర్కులను అగ్రిమెంట్ చేసుకునేందుకు కూడా కాంట్రాక్టర్లు ఆసక్తి చూపలేదు. ఇప్పుడు బలవంతంగా అగ్రిమెంట్లు చేయిస్తున్నారు.
- రెండో విడత నాడు-నేడు పనులు 1376 పాఠశాలల్లో రూ.466 కోట్ల అంచనాలతో చేపట్టారు. కానీ బిల్లుల సమస్యతో చాలా చోట్ల పనులు ఆగిపోయాయి.
- రూ.218 కోట్లతో 544 గ్రామ సచివాలయ భవనాల నిర్మాణం నాలుగేళ్ల క్రితం మొదలవగా ఇప్పటివరకు కేవలం 316 భవనాలు మాత్రమే పూర్తయ్యాయి. బిల్లులు రాక మిగిలిన భవనాల నిర్మాణం ఆగిపోగా, పూర్తయిన పలు భవనాలను కూడా కాంట్రాక్టర్లు అప్పగించడం లేదు.

మొత్తంగా చూసుకుంటే ఒక్క ఇరిగేషన్ శాఖలోనే సుమారు రూ.300 కోట్లు, పంచాయతీరాజ్ శాఖలో సుమారు రూ.100 కోట్లు, ఆర్‌అండ్‌బీ శాఖలో మరో రూ.100 కోట్ల వరకు బిల్లులు పెండింగ్ ఉన్నాయని అంచనా. ఇక అన్ని శాఖల్లో కలుపుకుంటే ఈ మొత్తం భారీగానే ఉంటుంది.

'ఖజానా'కు ఆంక్షలు

- సీఎఫ్ఎంఎస్‌లో బిల్లులు కదలకుండా ప్రోగ్రామ్
- బడ్జెట్ బిల్లుల చెల్లింపులకు ఫుల్‌స్టాప్
- ఇప్పటికే వేలల్లో బిల్లుల పెండింగ్
- జీతాలు, పెన్షన్ల చెల్లింపులకు ఓకే

ఖజానాకు ముందుగానే ఆంక్షల సైరన్ మోగింది. ప్రభుత్వం వద్ద నిధులు లేకపోవటంతో బిల్లుల చెల్లింపులు చేయలేని స్థితి ఏర్పడింది. దీంతో రాష్ట్రంలోని అన్ని రకాల బడ్జెట్ బిల్లుల చెల్లింపునకు ఆర్థిక శాఖ ఆంక్షలు విధిస్తూ ఈ నెల 1వ తేదీన సీఎఫ్ఎంఎస్‌కు, ఖజానా శాఖకు ఆదేశాలిచ్చింది. సీఎఫ్ఎంఎస్ (కాంప్రెహెన్సివ్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్)లో బిల్లులు ముందుకు కదలకుండా ఒక ప్రోగ్రాంను రాసి ఉంచినట్లు సమాచారం. దీంతో ట్రెజరీ అధికారులు బిల్లులను పాస్‌ఆన్‌చేస్తే అవి ముందుకు కదలడం లేదు. అయితే, ఈ విషయాన్ని కూడా బయటకు పొక్కకుండా ఆదేశించినట్లు సమాచారం. ఖజానాలో జీతాలు, పెన్షన్ల చెల్లింపులు తప్ప అన్ని రకాల బిల్లుల చెల్లింపులు ఆగిపోయాయి.



నెల్లూరు (హరనాథపురం), ఫిబ్రవరి 6 : సాధారణంగా ప్రతి ఏడాది మార్చిలో ఖజానాకు ఆంక్షలు విధిస్తుంటారు. కానీ ఈసారి నెల ముందుగానే ఆంక్షలు విధించారు. బడ్జెట్ బిల్లుల చెల్లింపులు జరిగితేనే ప్రభుత్వ కార్యాలయాలు వాటి మనుగడ సాగించగలవు. లేకపోతే కనీసం కరెంటు బిల్లులు చెల్లించలేని స్థితి ప్రభుత్వ కార్యాలయాలకు ఏర్పడుతుంది. జిల్లా ట్రెజరీలో ఉద్యోగ, ఉపాధ్యాయ, విశ్రాంత ఉద్యోగుల బిల్లులకు పాస్ ఆర్డర్ పడి, సీఎఫ్ఎంఎస్ పోర్టల్‌కు వివరాలు వెళ్లినా ప్రభుత్వం నగదును విడుదల చేయకపోవటంతో అవసరానికి డబ్బులు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆంక్షలకు ముందే వేలాదిగా జీపీఎఫ్ బిల్లులు, మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులతో పాటు పలురకాల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి.

● అవసరాలకు అందక...

పిల్లల పెళ్లిళ్లు, చదువుల కోసం దాచిపెట్టుకున్న జీపీఎఫ్ డబ్బులను పొందలేక, పెళ్లి ముహూర్తాలు కుదుర్చుకొని రద్దు చేసుకొన్న వారు ఎందరో జిల్లాలో ఉన్నారు. పరువు కోసం బంధువులు, స్నేహితుల వద్ద ఆర్థిక సాయం స్వీకరించి పెళ్లి తంతు ముగించిన ఎందరో ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఉన్నారు. ఆరు నెలలుగా జీపీఎఫ్ డబ్బును పొందటం జిల్లా ఉద్యోగ, ఉపాధ్యాయులకు కష్టతరంగా మారింది. ప్రతి ఉద్యోగి జీపీఎఫ్ ఖాతా తెరిచి అందులో కొంత దాచుకోవటం ఆనవాయితీ. గతం లో జీపీఎఫ్ డబ్బును పొందటం చాలా సులభంగా ఉండేది. ప్రస్తుతం ఆ పరిస్థితిలో చాలా మార్పు వచ్చింది. జీపీఎఫ్‌లో డబ్బు ఎందుకు దాచుకొన్నామనే భావన వేతన జీవుల్లో కలుగు తోంది. జిల్లాలో ఆరు నెలలకు పైబడి జీపీఎఫ్ బిల్లులు చెల్లింపులకు నోచుకోకుండా ఉన్నట్లు సమాచారం.

● **ఏపీజీఎల్ఐ** : ఉద్యోగ, ఉపాధ్యాయులు ఏపీజీఎల్ఐలో కూడా కొంత మొత్తాన్ని జీతం నుంచి పెట్టుబడి పెట్టుకొంటుం టారు. ఈ మొత్తాన్ని అవసర నిమిత్తం రుణంగా తీసుకొనే వెసులుబాటు ఉంటుంది. అయితే ఎనిమిది నెలలుగా ఏపీజీఎల్ఐ డబ్బులు పొందలేక నరక యాతన పడుతున్నారు.

● సరెండర్ లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్

ప్రతి ఉద్యోగికి సంవత్సరానికి నెల రోజులు సరెండర్ లీవ్ ఇస్తారు. ఈ లీవ్‌కు సంబంధించిన నెల రోజుల మొత్తాన్ని ఉద్యోగులు అమ్ముకొంటుంటారు. చాలా మంది ఉద్యోగులు అవసరాలకు ఉపయోగ పడుతుందని 2, 3 సంవత్సరాల సరెండర్ లీవ్‌లను ఎత్తి పెట్టుకొని ఎన్‌క్యాష్ చేసుకొంటారు. ఉదాహరణకు ఒక నెల జీతం ఉద్యోగికి రూ.లక్ష వస్తుందనుకొంటే, మూడు సంవత్సరాలు అతను ఎత్తి పెట్టుకొని అమ్ముకొంటే రూ.3లక్షలు పొందే వీలుంది. ప్రస్తుతం సరెండర్ లీవ్‌ను ఎన్‌క్యాష్ చేసుకోవడానికి బిల్లులు సమర్పించినా మంజూరు కావటం లేదు. రెండన్నర సంవత్సరాలుగా రూ. వెయ్యి కోట్ల వరకు బిల్లులు పెండింగ్ ఉన్నట్లు సమాచారం.

● మెడికల్ రీయింబర్స్‌మెంటు

ఉద్యోగ, ఉపాధ్యాయ, విశ్రాంత ఉద్యోగులు ముందుగా ఖర్చులు భరించి వైద్యం చేయించుకున్నాక పెట్టిన మెడికల్ రీయింబర్స్‌మెంటు బిల్లులు 8 నెలల నుంచి ఆగిపోయి ఉన్నాయి. జిల్లాలో సుమారు రూ.100 కోట్ల విలువైన 500లకు పైబడిన బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు సమచారం.



బిల్లులను వెంటనే చెల్లించాలి

విశ్రాంత ఉద్యోగులకు సంబంధించి లీవ్ ఎన్‌క్యాష్‌మెంటు బిల్లులను, మెడికల్ రీయింబర్స్ మెంటు బిల్లులను వెంటనే చెల్లించాలి. పెండింగ్ బిల్లులు చెల్లించకుండా ఖజానాకు ఆంక్షలు విధించడం సరికాదు. సంవత్సరాల తరబడి బిల్లులకు ఆమోదం తెలపక పోవటం వల్ల వృద్ధా ప్యంలో ఇబ్బందులు పడుతున్నాం. ఖజానాకు ఆంక్షలు ఎత్తేసి బిల్లులను వెంటనే చెల్లించాలి.

- ఐ. లక్ష్మీనారాయణ, ఆంధ్రప్రదేశ్ గవర్నమెంటు రిటైర్డు ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

దోమలు బాబోయ్ దోమలు!

విచ్చలవిడిగా నగరవాసులపై దాడి

నెల్లూరు నగరంలో దోమలు దండయాత్ర చేస్తున్నాయి. పొద్దువాలితే చాలు గుయ్.. మంటూ నివాసాల్లో జొరబడుతు న్నాయి. బయటకు రావాలంటేనే నగరవాసులు హడలిపోయే దాపురించింది. మరోవైపు పట్టపగలు కూడా ఆరుబయట ఉండలేని పరిస్థితి. డ్రైనేజీ కాలువలు, నీటి నిల్వ ప్రాంతాలలో పుట్టలను తెంచుకుని బయటకు వస్తున్న దోమలు ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. పరిస్థితి అదుపుదా టడంతో ప్రజలు పొద్దువాలితే చాలు తలుపులు, కిటీకీలు వేసుకుని ఇళ్లలో ఉండిపోతున్నారు. ఆఖరికి వాకిట్లో లైట్లు కూడా వేసుకోలేని దుస్థితి నెలకొంది. మంచినీటిలో పురుడుపోసు కుంటున్న దోమలు కావడంతో డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి విషపూరిత జ్వరాలు వచ్చే అవకాశాలు ఉన్నాయని వైద్యనిపుణులు హెచ్చరిస్తుండటంతో నగరవాసులు హడలిపోతున్నారు. నియంత్రణ చర్యల్లో కార్పొరేషన్ అధికారుల వైఫల్యం చెందుతున్నారని నగరవాసులు మండిపడుతు న్నారు. కనీసం ఫాగింగ్ చేయడం, కాలువల్లో ఆయిల్ బాల్స్ వంటి చర్యలు తీసుకోవడం లేదని వాపోతున్నారు. అయితే రోజుకు పది డివిజన్లను ఎంచుకుని దోమల నియంత్రణ చర్యలు చేపడు తున్నట్లు ఎంహెచ్‌వో వెంకటరమణయ్య తెలిపారు.

- నెల్లూరు (సిటీ)





ఇరుకళల పరమేశ్వరి ఆలయం వద్ద మురుగులో ఇల్లు



మురుగులో దోమల మంద



పాత కార్పొరేషన్ రోడ్డులో చెత్తతో నిండిన కాలువ

మంచమెక్కిన ఏరుకొల్లు

- ఊరంతా జ్వర పీడితులే... • గ్రామంలో లోపించిన పారిశుధ్యం




జ్వరంతో బాధపడుతున్న సాయి, గురవయ్య

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), ఫిబ్రవరి 6: మండలంలోని ఏరుకొల్లు గ్రామం మంచమెక్కింది. ప్రతి ఇంట్లో ఒకరిద్దరు ఒళ్లు నొప్పులు, జ్వరంతో బాధపడుతూ వైద్యశాలల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. మురుగు నీరు రోడ్లపై ప్రవహిస్తూ దోమల విజృంభిస్తుం డడంతో జ్వరాలు ప్రబలుతున్నాయని గ్రామ స్థులు వాపోతున్నారు. వీధులు శుభ్రం చేసి బ్లీచింగ్ చల్లిన పాపాన పోలేదని వారు ఆరోపి స్తున్నారు. గ్రామంలో వారం రోజులుగా సాయి, గురవయ్య, పేరయ్య, శ్రీరాములు, సుబ్బారావు, రమాదేవి, కొండమ్మ తదితరులు జ్వరంతో బాధపడుతూ మంచానికే పరిమితమయ్యారు. మరికొందరు ఇతర ప్రాంతాల్లో చికిత్స పొందుతున్నారని తెలిపారు. జ్వరం బారినపడ్డ వృద్ధు లు, చిన్నారుల పరిస్థితి దారుణంగా ఉందని వాపోయారు. రోజుల తరబడి జ్వరం తగ్గకపోవడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరతున్నారు.



ఏరుకొల్లు వీధుల్లో పారుతున్న మురుగు నీరు

నడికుడి-శ్రీకాళహస్తి రైల్వేలైన్‌కు రూ.450 కోట్లు

- ఇప్పటికే పూర్తయిన భూసేకరణ
- పనులు పూర్తయితే మెట్టలో మెరుగుపడనున్న రవాణా వ్యవస్థ

జిల్లాలో మెట్టప్రాంత వాసులకు కేంద్ర విత్త మంత్రి నిర్మలమ్మ కాస్త ఊరటనిచ్చారు. శ్రీకాళహస్తి-నడికుడి రైల్వేలైన్‌కు మధ్యంతర బడ్జెట్‌లో భారీగా నిధులు కేటాయించారు. గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాల మీదుగా 38 స్టేషన్ల ఏర్పాటు, 309 కి.మీ పొడవున ఈ లైన్ ఏర్పాటు కానుంది. పనులు పూర్తయితే మెట్ట ప్రాంతాల్లో రవాణా వ్యవస్థ మెరుగు పడటంతో పాటు హైదరాబాదు, విజయవాడ వంటి నగరాలకు దూరం తగ్గనుంది.

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 6 : 2011-12 బడ్జెట్‌లో రూ.2,289 కోట్లతో కేంద్రం ఈ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపట్టే ఈ ప్రాజెక్టుకు 2016 వరకు బడ్జెట్‌లో ఎలాంటి కేటాయిం పులు జరగలేదు. గతేడాది రూ.202 కోట్లు కేటాయించగా ప్రస్తుత బడ్జెట్‌లో మూలధనం కింద రూ.150 కోట్లు, సేఫ్టీఫండ్ కింద మరో రూ.300 కోట్లు కేటాయించారు. తొలుత గుంటూరు జిల్లా పిడుగురాళ్ల నుంచి పనులు ప్రారంభమవగా, మిగిలిన చోట్ల వివిధ దశల్లో ఉన్నాయి. ఈ రైల్వేలైన్ నిర్మాణానికి 5,189 ఎకరాల భూమి అవసరం ఉండగా, 2019లోనే జిల్లాలో గ్రామసభలు నిర్వహించి సుమారు 2,268 ఎకరాల భూమిని అధికారులు సేకరించారు. వరికుంటపాడు, వింజమూరు, ఆత్మకూరు, రాపూరు, వెంకటగిరి మండలాల మీదుగా 15 రైల్వేస్టేషన్లతో రైల్వే మార్గం పనులు సాగనున్నాయి. కాగా, 2018లో రైల్వేలైన్ పనులు పూర్తి చేయాలని లక్ష్యం పెట్టు కోగా 2022 దాకా పొడిగించారు. 2026 దాకా కూడా పనులు పూర్తయేలా లేవని పలువురు తెలుపుతున్నారు.

బడ్జెట్ విడుదల ఇలా..

సంవత్సరం	నిధులు (రూ.కోట్లలో)
2013-14	3
2014-15	10
2015-16	110
2017-18	220
2018-19	750
2019-20	1198
2020-21	1500
2022-23	38
2023-24	202
2024-25	450



• మెట్ట ప్రాంతాలకు ప్రయోజనం

అభివృద్ధితోపాటు రవాణాకు నడికుడి-శ్రీకాళహస్తి మార్గం ఎంతగానో ఉపయోగపడుతుంది. తిరుపతి, హైదరాబాదు మధ్య సుమారు 80 కిలోమీటర్ల దూరం తగ్గనుంది. ఈ మార్గం అందుబాటులోకి వస్తే గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లోని మెట్ట ప్రాంతాలకు రవాణా సౌకర్యాలు మెరుగు పడతాయి. మెట్ట ప్రాంతాల్లో వ్యవసాయ, పండ్ల తోటల ఉత్పత్తు ల ఎగుమతులకు అవకాశం ఏర్పడి వాణిజ్యపరంగా అభివృద్ధి చెందే అవకాశాలు ఉన్నాయి. మరోవైపు వరదల సమయంలో మెట్ట ప్రాంత రైల్వేలైన్ ఎంతగా ఉపయోగపడుతుంది.

ఏప్రిల్‌లో టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్షలు

నెల్లూరు (విద్య), ఫిబ్రవరి 6 : టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సుకు సంబంధించిన డ్రాయింగ్, హ్యాండ్‌లూమ్, వీవింగ్, టైలరింగ్, ఎంబ్రాయిడరీ లోయర్, హయ్యర్ పరీక్షలను ఏప్రిల్ నెలలో నిర్వహిస్తారని డీఈవో గంగాభవాని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు తప్పనిసరిగా 7వ తరగతిగానీ, సంబంధిత ట్రేడ్‌లలో లోయర్ గ్రేడ్‌గానీ, తత్సమాన పరీక్షగానీ పాస్ అయి ఉండాలన్నారు. అర్హత కలిగిన వారు www.bse.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏపీలో కాకుండా ఇతర రాష్ట్రాల్లో లోయర్ గ్రేడ్, తత్సమాన పరీక్ష పాస్ అయిన వారు తప్పనిసరిగా ఏపీ ప్రభుత్వ పరీక్ష సంచాలకుల అనుమతితో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. డ్రాయింగ్ లోయర్ గ్రేడ్‌కు రూ.100, హయ్యర్ గ్రేడ్‌కు రూ.150, హ్యాండ్‌లూమ్ లోయర్‌కు రూ.150, హయ్యర్‌కు రూ.200, టైలరింగ్, ఎంబ్రాయిడరీ లోయర్ రూ.150, హయ్యర్‌కు రూ.200 ఫీజును ఈనెల 20వతేదీ లోపు ఎలాంటి రుసుము లేకుండా చెల్లించాలన్నారు. అలాగే రూ.50 అపరాధ రుసుముతో ఈనెల 29వతేదీ వరకు, రూ.75 అపరాధ రుసుముతో మార్చి 6వతేదీ వరకు ఫీజు చెల్లించవచ్చన్నారు. మరిన్ని వివరాలకు నెల్లూరులోని దర్గామిట్ట జడ్పీ బాలికోన్నత పాఠశాలలో గల జిల్లా పరీక్షల విభాగం కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

ఇంటర్ ఒకేషనల్ ప్రాక్టికల్స్‌కు 104 మంది గైర్హాజరు

నెల్లూరు (విద్య): ఇంటర్మీడియట్ ఒకే షనల్ ప్రాక్టికల్ పరీక్షల్లో భాగంగా మంగళవారం జరిగిన పరీక్షలకు 104 మంది గైర్హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా ఉదయం 8 కేంద్రాల్లో 382 మంది హాజరు కావాల్సి ఉండగా 316 మంది హాజరయ్యారు. 66 మంది గైర్హాజర య్యారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షలకు 382 మంది హాజరు కావాల్సి ఉండగా 342 మంది హాజరయ్యారు. 40 మంది గైర్హాజరయ్యారు. పరీక్షల నిర్వహణ తీరును ఇంటర్‌బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి డాక్టర్ ఏ శ్రీనివాసులు, డీఈసీ సభ్యులు పరిశీలించారు.

డీఎస్వోగా వెంకటరమణ



నెల్లూరు (హరనాథపురం) : జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారిగా డి. వెంకటరమణ మంగళవారం బాధ్య తలు స్వీకరించారు. శ్రీకాకుళంలో డీఎస్వోగా పని చేస్తున్న ఈయన బదిలీపై నెల్లూరుకు వచ్చారు.

మార్చి 17న ఏపీజీఈఏ ఎన్నికలు

నెల్లూరు (హరనాథపురం): మార్చి 17న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘానికి ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ఎన్నికల అధికారి, రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి జి. నాగసాయి ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 3న నామినేషన్ పత్రాల స్వీకరణ, పరిశీలన అనంతరం మధ్యాహ్నం 1 గంటకు పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితా ప్రక టిస్తామని తెలిపారు. పోటీ అనివార్యమైతే మార్చి 17న ఉదయం 10 గంటలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

మర్రిపాడు, ఫిబ్రవరి 6 : లారీని ఢీకొని బైక్‌పై వెళ్తున్న యువకుడు మృతి చెందాడు.ఈ ఘటన నెల్లూరు-ముంబాయి జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి రాజుపాలెం వద్ద చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు, అనంతసాగరం మండలం చిలకలమర్రికి చెందిన నల్లు పోలయ్య(30) మర్రిపాడు మండలం చుంచులూరులో పొలం వద్ద కాపలా ఉంటున్నాడు. మంగళవారం సాయంత్రం కూరగాయలు కొనుగోలు చేసుకుని మర్రిపాడుకు వెళ్లాడు. తిరిగి పొలం వద్దకు బైక్ పై వెళ్తుండగా ముందు వెళ్తున్న లారీని క్రాస్ చేయబోయి వెనక వైపు నుంచి ఢీకొన్నాడు. తీవ్రంగా గాయపడిన అతన్ని చికిత్స నిమిత్తం 108లో ఆత్మకూరు తరలిస్తుండగా, మార్గమధ్యంలో మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని..

చిట్రగుంట, ఫిబ్రవరి 6: బోగోలు మండల కోవూరుపల్లి సమీపంలో జాతీయ రహదారిపై ఆర్టీసీ బస్సు ఢీకొని వై.చంద్రశేఖర్ (50) మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న కావలి రూరల్ సీఐ నాగభూషణం సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు మూలాపేటకు చెందిన చంద్రశేఖర్ ఒంగోలు నుంచి స్కూటీపై నెల్లూరుకు వెళుతుండగా కావలి నుంచి అల్లూరుకు వెళుతున్న ఆర్టీసీ బస్సు కోవూరు పల్లి సర్వీస్ రోడ్డు నుంచి హైవేపైకి వస్తున్న క్రమంలో స్కూటీని ఢీకొంది. దీంతో స్కూటీతో పాటు చంద్రశేఖర్ అదుపు తప్పి పడగా బస్సు వెనుక చక్రం ఎక్కడంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి అన్న కుమారుడు మునికుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు పోలీసులు తెలిపారు.



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న రూరల్ సీఐ నాగభూషణం

బెల్టు దుకాణం నిర్వాహకుడి అరెస్టు

సంగం, ఫిబ్రవరి 6: స్థానిక బస్టాండ్ సెంటర్‌లో మద్యం బెల్టు దుకాణం నిర్వాహకుడు బీ వెంకటేశ్వర్లును మంగళవారం ఎస్ఐ నాగార్జునరెడ్డి అరెస్ట్ చేశారు. ముందుగా అందిన సమాచారం మేరకు మద్యం బెల్టు దుకాణంపై ఎస్ఐ తన సిబ్బందితో దాడి చేశారు. నిర్వాహకుడి నుంచి 13 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

చెరువులో పడి మేకల కాపరి మృతి

ఆత్మకూరు, ఫిబ్రవరి 6: మండలంలోని కనుపూరుపల్లికి చెందిన వడిగి వెంకటశివ(13) అనే మేకల కాపరి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడు. ఈ విషయం మంగళవారం వెలుగులోకి వచ్చింది. సేకరించిన సమాచారం మేరకు, కనుపూరుపల్లి హరిజనవాడకు చెందిన వడిగి సుగుణమ్మ కుమారుడు వెంకటశివ సోమవారం మేకలను తోలుకుని గ్రామ సమీపంలోని చెరువు వద్దకు వెళ్లాడు. సాయంత్రానికి ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు, గ్రామస్థులు గాలింపు చేపట్టారు. చెరువు గట్టున చెప్పులు ఉండడంతో చెరువులోకి దిగి వెతికారు. కానీ ప్రయోజనం లేకపోయింది. సమాచారం అందుకున్న ఆత్మకూరు అగ్నిమాపకదళ సిబ్బంది మంగళవారం చెరువులోకి దిగి గాలింపు చర్యలు చేపట్టి యువకుడి మృతదేహాన్ని వెలుపలికి తెచ్చారు. మేకలు తోలుకొని వెళ్లిన వెంకటశివ మంచినీళ్లు తాగడానికో, లేక ఈత కొట్టడానికో చెరువులోకి దిగి ప్రమాదవశాత్తు మునిగిపోయి చనిపోయి ఉంటాడని భావిస్తున్నారు. వెంకటశివ తండ్రి నాలుగేళ్ల క్రితమే చనిపోయాడు. ఇద్దరు అక్కలకు పెళ్లిళ్లు కావడంతో వారు అత్తవారింటికి వెళ్లిపోయారు. తల్లికి ఆధారంగా ఉన్న వెంకటశివ చనిపోవడంతో ఆ కుటుంబం అనాథ అయింది. కాగా బిడ్డ మృతదేహాన్ని చూసి తల్లి సుగుణమ్మ కన్నీరు మున్నీరుగా విలపించారు. ఈ దృశ్యం చూపరులను కంటతడి పెట్టించింది.



చెరువులో నుంచి వెంకటశివ మృతదేహాన్ని తీసుకువస్తున్న ఫైర్ సిబ్బంది

బావిలో పడి...

బుచ్చిరెడ్డిపాళెం : మండలంలోని పెనుబల్లిలో ఇరగరాజు రామయ్య(45) బావిలో పడి మృతి చెందిన ఘటన మంగళవారం వెలుగు చూసింది. స్థానికుల కథనం మేరకు.. పెనుబల్లిలోని రాములోరి గుడి ఎదురుగా ఓ బావి ఉంది. స్థానికులు నిత్యం ఆ బావి గట్టుపై కూర్చుంటుంటారు. ఎప్పటిలాగే రామయ్య సోమవారం సాయంత్రం ఆ బావిపై కూర్చుని ఉండగా పలువురు చూశారు. ఐతే రామయ్య బావిలోపడేటప్పుడు ఎవ్వరూ గమనించలేదు. సోమవారం రాత్రి ఎంతకీ ఇంటికి రాకపోవడంతో ఏదైనా ఊరెళ్లి ఉంటాడని భావించారు. అయినా ఆలయ కోసం గాలించారు. మంగళవారం కూడా ఇంటికి రాకపోవడంతో గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఈ క్రమంలో రాత్రి 8 గంటలకు బావిపైన కూర్చునేందుకు వెళ్లిన పలువురు బావిలో నీటిపై ఏదో తేలి ఉన్నట్టు కనిపించడంతో లైటు వేసి చూడగా రామయ్య మృతదేహంగా గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు వచ్చి పరిశీలించి దర్యాప్తు చేస్తున్నారు. కాగా రామయ్య దంపతులకు 25 ఏళ్ల నిరీక్షణ అనంతరం 4 నెలలు క్రితమే వారికి ఓ పాప జన్మించింది. రామయ్య మృతి ఆ కుటుంబాన్ని శోకసంద్రంలో ముంచింది. గ్రామంలో విషాదం నెలకొంది.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	136
లేయర్ లైవ్	85
స్కిన్ చికెన్	240
స్కిన్‌లెస్	266
లేయర్	145

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 5955
వెండి కిలో ధర	రూ. 72,000
వెండి ఒక గ్రాము	రూ. 74.00

వృద్ధుడి అదృశ్యంపై కేసు నమోదు

సంగం, ఫిబ్రవరి 6: మండలంలోని తలుపూరుపాడుకి చెందిన షేక్ చోటే సాహెబ్ (68) నెల నుంచి కనిపించలేదని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు మంగళవారం స్టేషన్‌లో కేసు నమోదయింది. గ్రామానికి చెందిన చోటే సాహెబ్ గతనెల 6న ఇంటి నుంచి వెళ్లిపోయాడు. బంధువులు ఇళ్లన్నీ వెతికినా కనిపించలేదు. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

సింహపురి కాదు దోమలపురి!

- ఓట్లేసిన ప్రజలు అల్లాడుతుంటే 'పేట'కు పారిపోయిన అనిల్
- పన్ను వసూళ్లపై ఉన్న శ్రద్ధ పారిశుధ్యంపై ఏదీ!?
- టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి ఆగ్రహం



విలేకరులతో మాట్లాడుతున్న కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి

నెల్లూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : సింహపురి కాస్తా దోమలపురిగా మారిపోయిందని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి వ్యాఖ్యానించారు. నగరవాసులు డెంగ్యూ, టైఫాయిడ్ వంటి వ్యాధులతో అల్లాడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం నెల్లూరులోని ఎన్టీఆర్ భవన్‌లో కోటంరెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దోమలు, వైసీపీ నేతలు కలిసి ప్రజల రక్తాన్ని తాగుతున్నారని విమర్శించారు. దోమల దెబ్బకి నగర ప్రజలు అల్లాడుతుంటే ఓట్లు వేసి గెలిపించుకున్న ఎమ్మెల్యే అనీల్‌కుమార్ నరసరావుపేటకు పారిపోయారని దుయ్యబట్టారు. మేయర్, కార్పొరేషన్ అధికారులు ప్రచార ఆర్భాటం తప్ప దోమల నియంత్రణకు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. నెల్లూరు సిటీ నియోజకవర్గాన్ని కార్పొరేషన్ నుంచి విడదీసినట్లుగా ఉన్నారని, ఒక్కరోజు కూడా మేయర్ సిటీ నియోజకవర్గంలో పర్యటించిన దాఖలాలు కనిపించడం లేదని విమర్శించారు. బలవంతంగా చెత్త పన్ను వసూలు చేస్తున్న మున్సిపల్ అధికారులకు రోడ్లపై ఉన్న చెత్త కనిపించడం లేదా!? అని ప్రశ్నించారు. తెలుగుదేశం ప్రభుత్వంలో పక్కా ప్రణాళికతో కాలువల్లో పూడిక తీయిస్తే నేడు పట్టించుకునేవారు కరువయ్యారని మండిపడ్డారు. పూడిక తీయకుండానే తీసినట్లుగా వైసీపీ నాయకులు ప్రజాధనాన్ని దిగమింగుతున్నారని కోటంరెడ్డి ఆరోపించారు. దోమల నివారణకు చర్యలు తీసుకోకపోతే టీడీపీ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు మామిడాల మధు, ఉచ్చి భువనేశ్వరప్రసాద్, పిట్టి సత్యనాగేశ్వరరావు, కువ్వారపు బాలాజీ, తిరుమలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తుల అరెస్ట్

నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 6 : గంజాయిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను సెబ్ అధికారులు మంగళవారం అరెస్ట్ చేశారు. సెబ్ నెల్లూరు-1 ఇన్‌స్పెక్టర్ ఆర్ విజయభాస్కర్ తన కార్యాలయంలో నిందితుల తెలిపారు. తాను, డీఎస్ఈవో పోలీసు టీం ఎస్ఐ బాలకృష్ణ తమ సిబ్బందితో కలిసి నెల్లూరు ఆర్టీసీ ప్రధాన బస్టాండులో తనిఖీలు చేపట్టామని చెప్పారు. అనుమానాస్పదంగా ఉన్న ఒడిశా రాష్ట్రం కోరాపూట్ జిల్లా అంపబాలి మండలం సౌరాడ గ్రామానికి చెందిన ఏ శామ్యూల్, తోలోగోలూరు గ్రామానికి చెందిన బిశ్వాంబర్ సాబాయిలను అదుపులోకి తీసుకున్నామని, వారి వద్ద ఉన్న బ్యాగ్‌లను తనిఖీ చేయగా రూ.1.02 లక్షల విలువ చేసే 8.74 కేజీల గంజాయి బయటపడిందని తెలిపారు. నిందితులను, గంజాయిని, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. కొంతకాలంగా కమిషన్ పద్ధతిలో ఒడిశా నుంచి బెంగళూరులోని వ్యాపారులకు గంజాయిని చేరవేస్తున్నట్లు విచారణలో తెలిపారన్నారు. దీంతో నిందితులను అరెస్ట్ చేశామని ఇన్‌స్పెక్టర్ చెప్పారు.

స్వయం సహాయక సంఘాలతో 'జలజీవన్ మిషన్' పనులు

- కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు (జడ్పీ), ఫిబ్రవరి 6 : జిల్లాలోని ప్రతి ఇంటికి కొళాయి కనెక్షన్ ఇచ్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రారంభించిన జలజీవన్ మిషన్ పథకం పనులను స్వయం సహాయక గ్రామ సంఘాల ద్వారా పూర్తిచేయాలని కలెక్టర్ హరినారాయణన్ ఆదేశించారు. జలజీవన్ మిషన్ జిల్లా స్థాయి కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన కలెక్టరేట్‌లో మంగళవారం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఈ పథకం పనులకు టెంటర్లు పిలిచినప్పటికీ స్పందన లేకపోవడంతో స్వయం సహాయక గ్రామ సంఘాల ద్వారా పూర్తిచేయాలని ప్రభుత్వం ప్రత్యేకంగా జీవో జారీ చేసిందన్నారు. దీనిపై సంఘాలకు అవగాహన కల్పించడంతోపాటు శిక్షణా కార్యక్రమాలను నిర్వహించి మహిళల భాగస్వామ్యంతో పనులను పూర్తి చేయాలని సూచిం చారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు గ్రామ జల సంఘ సభ్యులకు అవసరమైన పరిజ్ఞానాన్ని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు అందించాలన్నారు. పనుల పురోగతిపై మండల స్థాయి కమిటీలు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో కన్నమ నాయుడు, డీపీవో సుస్మితారెడ్డి, డ్వామా పీడీ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లకు ప్రణాళికలు సిద్ధం చేయండి

నెల్లూరు(హరనాథపురం): రైతులు పండించిన ధాన్యం కొనుగోళ్లకు ఇప్పటి నుంచే ప్రణాళి కలు సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం అధికారులతో ఆయన సమీక్షించారు. ధాన్యం కొనుగోలుకు తగినన్ని కేంద్రాలు ఏర్పాటు చేయాలని, కనీస మద్దతు ధర రాలేదని ఏ రైతూ బాధపడకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జేసీ ఆదర్శ రాజేంద్రన్, సివిల్ సప్లయిస్ డీఎం లక్ష్మీనరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

రెండు మోటారు సైకిళ్ల ఢీ : ఇద్దరికి గాయాలు

కావలి రూరల్, ఫిబ్రవరి 6: కావలి పట్టణం ముసునూరు సమీపంలోని ట్రంక్‌రోడ్డులో మంగళవారం రాత్రి రెండు మోటారుసైకిళ్లు ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. కావలి మండలం గౌరవరంకు చెందిన గోవర్ధన్ పట్టణంలోని ఓ ప్రయివేటు వైద్యశాలలో పనిచేస్తున్న భార్యను తీసుకువెళ్లేందుకు కావలి బయలుదేరాడు. అలాగే ముసునూరు విద్యుత్ కార్యాలయం ఎదురుగా ఉన్న ఎస్టీ కాలనీకి చెందిన వంటమాస్టర్ కమల్ కావలి నుంచి ముసునూరుకు వెళ్తున్నాడు. వీరు మార్గమధ్యంలోని హోండా షోరూం సమీపంలో వచ్చే సరికి ఎదురెదురుగా ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో ఇరువురికి గాయాలైనప్పటికీ కమల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. కాగా ప్రమాదం జరిగే సమయంలో అటువైపు వస్తున్న పట్టణానికి చెందిన దావులూరి ఆనంద్ రోడ్డుపై పడి ఉన్న కమల్‌ను వైద్యశాలకు తరలించేందుకు ప్రయత్నించాడు. ఇదే సమయంలో ముసునూరు బ్రహ్మంగారి గుడి ప్రాంతానికి చెందిన వ్యక్తి తన కారును ఆపి క్షతగాత్రుడ్ని పట్టణంలోని ఓ ప్రయివేటు వైద్యశాలకు తరలించడం తో వారిని స్థానికులు అభినందించారు. రూరల్ సీఐ కాటూరి శ్రీనివాసరావు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.



వైద్యశాలలో చికిత్స పొందుతున్న కమల్

కావలిలో చైన్ స్నాచింగ్

- 5 సవర్ల సరుడు అపహరణ

కావలి రూరల్, ఫిబ్రవరి 6: కావలి పట్టణం పుల్లారెడ్డి నగర్‌లో మంగళవారం మధ్యాహ్నం మోటారు సైకిల్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు ఓ మహిళ మెడలోని సరుడు లాక్కెళ్లారు. 1వ పట్టణ పోలీసుల కథనం మేరకు.. పుల్లారెడ్డి నగర్‌కు చెందిన రామిరెడ్డి నవరత్నమ్మ బజారు నుంచి ఇంటికి వెళ్తుండగా మోటారు సైకిల్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు నవరత్నమ్మను పాఠశాల అడ్రస్ అడుగుతూ ఆమె మెడలోని 5 సవర్ల సరుడును లాక్కుని హడాయించారు. ఆమె కేకలు వేసేటప్పటికే వారు కనుమరుగయ్యారు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా ఏఎస్ఐ సుబ్బయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

28కల్లా ఫిషింగ్‌హార్బర్ పూర్తి

- ఎంపీ వేమిరెడ్డి ప్రశ్నకు కేంద్రమంత్రి సమాధానం

నెల్లూరు(హరనాథపురం); ఫిబ్రవరి 6 : జిల్లాలోని జువ్వలదిన్నెలో ఫిషింగ్ హార్బర్ నిర్మాణం ఈ నెల 28వ తేదీకల్లా పూర్తవుతుందని కేంద్ర ఓడరేవులు, షిప్పింగ్, జలరవాణా శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్ స్పష్టం చేవారు. ఫిషింగ్ హార్బర్‌ను ఎప్పటికి పూర్తిచేస్తారని రాజ్య సభలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నించారు. ఇందు కు కేంద్ర మంత్రి సమాధానమిస్తూ నీలి విప్లవం సమీ కృత అభివృద్ధి, ఫిషరీస్, జలరవాణాశాఖ ఆధ్వర్యంలో సాగ రమాల పథకం కింద ఈ ప్రాజెక్టు మంజూరైనట్లు తెలి పారు. 28 నాటికి నిర్మాణం పూర్తవుతుందని తెలిపారు.

ఓ వ్యక్తిపై హోంగార్డు కత్తులతో దాడి

నెల్లూరు(క్రైం) ఫిబ్రవరి 6: పాతకక్షల నేపథ్యంలో ఓ వ్యక్తిపై హోంగార్డు, అతని స్నేహితుడు కలిసి కత్తులతో దాడి చేశారు. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరులోని గాంధీ నగర్‌కు చెందిన రవికుమార్ అయ్యప్పగుడి సెంటర్‌లోని హేర్ కటింగ్ దుకాణంలో పనిచేస్తున్నాడు. గతేడాది వినాయకచవితి వేడుకల్లో రవికుమార్‌కు, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న హోంగార్డు సురేష్‌కు మధ్య గొడవ జరిగింది. అప్పట్లో హోంగార్డు ఫిర్యాదు మేరకు వేదాయపాళెం పోలీసులు రవికుమార్‌పై కేసు నమోదు చేశారు. ఇటీవల లోక్ అదాలత్‌లో కేసు రాజీ అయ్యింది. అయినా సురేష్ పాత గొడవను మనసులో పెట్టుకుని రవికుమార్ కనిపించినప్పు డల్లా అంతుచూస్తానని బెదిరించే వాడు. ఈ విషయాన్ని రవికుమార్ తన భార్య సుమలతకు చెప్పి బాధపడేవాడు. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి 11.30 గంటల వరకు రవికుమార్ ఇంటికి రాకపోవడంతో భార్య ఎదురుచూడసాగింది. అదే ప్రాంతానికి చెందిన కృష్ణ అనే వ్యక్తి వచ్చి రవి కుమార్‌పై ఎవరో కత్తులతో దాడి చేస్తున్నారని చెప్పడంతో సుమలత పరుగుపరుగున అక్కడికి వెళ్లింది. హోంగార్డు సురేష్, అతని స్నేహితుడు విజయకృష్ణ కత్తులతో భర్తపై దాడిచేయడాన్ని గమనించి కేకలు పెట్టింది. స్థానికులు కూడా రావడాన్ని గమనించిన నిందితులు బైక్‌పై పరారయ్యారు. తీవ్రగాయాలతో ఉన్న రవికుమార్‌ను జీజీహెచ్‌కు, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం కిమ్స్ వైద్యశాలకు తరలిం చారు. సుమలత మంగళవారం వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు హోంగార్డు, అతని స్నేహితునిపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు.

ప్రజల గుండెల్లో ఉన్నా గెలుపు నాదే!

- పెంచలకోనలో మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల

రాపూరు(డక్కిలి), ఫిబ్రవరి 6 : వెంకటగిరి ప్రజల గుండెల్లో ఉనన తనను వారి నుంచి ఎవరూ వేరుచేయలేరని మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ స్పష్టం చేశారు. రాపూరు మండలం పెంచలకోనకు తన అనుచరులతో మంగళవారం చేరుకుని నృసింహస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఎన్నికల్లో పోటీచేసే ముందు మొదట వెంకటగిరి గ్రామ శక్తి పోలేరమ్మను ఆ తర్వాత నృసింహస్వామిని దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. శ్రీవారి దర్శనం అనంతరం కురుగొండ్ల విలేకరులతో మాట్లాడుతూ వెంకటగిరి ఎమ్మెల్యేగా పదేళ్లు పనిచేసిన తాను నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశానని అన్నారు. తాను ఓడినా గెలిచినా నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ వస్తున్నానే తప్ప వెంకటగిరి వదిలి పారిపోలేదన్నారు. స్థానికేతరులకు వెంకటగిరి ప్రజలు ఓట్లు వేయరని స్పష్టం చేశారు. నియోజకవర్గంలో టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధి తప్ప వైసీపీ పాలనలో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. అనంతరం రాపూరులో క్లస్టర్, బూత్ ఇన్‌చార్జిలకు ఇంటిగ్రేడ్ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆయన వెంట టీడీపీ నాయకులు కే వీకే ప్రసానద్ నాయుడు, ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు, పోలంరెడ్డి, కోటేశ్వరరెడ్డి, పులికొల్లు రాజేశ్వరరావు, అవ్వారు సత్యం, కాపా శ్రీనివాసులు నాయుడు, గంగాధరం, సత్యం తదితరులు ఉన్నారు.



పెంచలకోనలో తన అనుచరులతో కురుగొండ్ల రామకృష్ణ

9న జరిగే 'డీ వార్మింగ్'ను విజయవంతం చేయండి



ఉదయగిరి : గోడపత్రికలు ఆవిష్కరిస్తున్న వైద్యాధికారి, సిబ్బంది



సంగం : గోడపత్రికలు ఆవిష్కరిస్తున్న అధికారులు

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 6: మండలంలో ఈనెల 9న నిర్వహించే డీవార్మింగ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గండిపాళెం పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.శివకల్పన పేర్కొన్నారు. మంగళవారం పాత సీహెచ్‌సీలో సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీసీజీ సర్వేను నూరు శాతం పూర్తి చేయాలన్నారు. డీవార్మింగ్ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఇటీవల రిపబ్లిక్‌డే సందర్భంగా అవార్డు అందుకున్న వైద్యాధికారి శివకల్పన, ఆరోగ్యబోధకుడు, ఏఎన్ఎం నూర్జహాన్‌లను సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో శివకుమారి, మలేరియా సబ్ యూనిట్ అధికారి నౌషాద్‌బాబు, టీబీ ట్రీట్‌మెంట్ ఆర్గనైజర్ భోగ్యం వెంకటేశ్వర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంగం: తహసీల్దారు కార్యాలయంలో మంగళవారం అధికారులు జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంపై వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ నెల 9న జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని నిర్వహింపనున్నట్లు వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. అవగాహన నిమిత్తం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీటీ ప్రవీణ్ కుమార్, ఈవోఆర్డీ అప్పాజీ, ఎంఈవో జానకీరామ్, మల్లయ్య పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే బీఎస్ఆర్‌కు ఘన నివాళి



బీఎస్ఆర్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న కుటుంబ సభ్యులు, వివిధ పార్టీల నేతలు

ఆత్మకూరు, ఫిబ్రవరి 6 : ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బొమ్మిరెడ్డి సుందరరామిరెడ్డి(బీఎస్ఆర్) నాలుగవ వర్ధంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా పట్టణంలోని బీఎస్ఆర్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించిన అనంతరం బీఎస్ఆర్ విగ్రహానికి ప్రముఖ గుండె వైద్యనిపుణులు డాక్టర్ తూమాటి రామకృష్ణారెడ్డి, జడ్పీ మాజీ చైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, కుటుంబసభ్యులు, వివిధ పార్టీల నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తదనంతరం పట్టణంలోని ప్రభుత్వ జిల్లా వైద్యశాలలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు.

ఓటర్ల జాబితాలో తప్పుల సవరణ : ఆర్వో



మాట్లాడుతున్న ఆర్వో రాజా రమేష్ ప్రేమ్‌కుమార్

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 6: తాజా ఓటర్ల జాబితాలో తప్పుల సవరణకు చర్యలు చేపడతామని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజా రమేష్ ప్రేమ్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారులు, రాజకీయ పార్టీల నాయకులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ జాబితాలో వచ్చిన తప్పులను గుర్తించామని, వాటిని సవరించేందుకు చర్యలు చేపడతామన్నారు. బీఎల్‌వోలు సర్వే సక్రమంగా చేయని కారణంగా తప్పులు దొర్లాయని రాజకీయ పార్టీల నాయకులు ఆర్వో దృష్టికి తీసుకెళ్లారు. వాటన్నింటిని ఎన్నికల నాటికి సరిచేసి సమగ్ర ఓటర్ల జాబితా వచ్చేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో ఏఆర్వో నెప్రహాబాబు, రాజకీయ పార్టీ నాయకులు సీహెచ్ బయ్యన్న, కాకు వెంకటయ్య, జీ.ఓబులరెడ్డి, అలీఅహ్మద్, సత్తెనపల్లి బాలయ్య, జీ.వెంకటేశ్వరరావు, రవీంద్ర పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో సత్తా చాటాలి : బీజేపీ నేతలు



మాట్లాడుతున్న మల్లికార్జునరెడ్డి

ఆత్మకూరు, ఫిబ్రవరి 6 : వచ్చే ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలని, ప్రధాని మోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆ పార్టీ సీనియర్ నేతలు పిలుపునిచ్చారు. మంగళవారం ఆత్మకూరులోని త్రికోటేశ్వర కల్యాణ మండలంలో నియోజకవర్గ కన్వీనర్ కంది మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికల సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నేతలు సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, సన్నారెడ్డి దయాకర్ రెడ్డి, కాకు విజయలక్ష్మి, గాజుల వెంకయ్యానాయుడు తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రజలను ఓటు అడిగే హక్కు ఒక బీజేపీకే ఉం దన్నారు. నేతలు, కార్యకర్తలు సమష్టిగా పనిచేసి నియోజకవర్గంలో సత్తా చాటాలని తెలిపా రు. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు కాలం బుజ్జిరెడ్డి, కుడుముల సుధాకర్ రెడ్డి, కరటంపాటి సుధాకర్, చింతపల్లి భరత్‌రెడ్డి, నరసింహులునాయుడు, బత్తల కృష్ణయ్య, చెరుకూరు రమణయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

కావలిలో టీడీపీ జెండా ఎగురవేయడం తథ్యం : కావ్య



అభిమానుల సైకిల్ యాత్రను ప్రారంభిస్తున్న కావ్య క్రిష్ణారెడ్డి

కావలి, ఫిబ్రవరి 6: రానున్న ఎన్నికల్లో కావలి నియోజకవర్గంలో టీడీపీ జెండాను ఎగురవేయడం తథ్యమని ఆ పార్టీ కావలి నియోజకవర్గ ఇన్‌చార్జి కావ్య క్రిష్ణారెడ్డి తెలిపారు. టీడీపీ ఇన్‌చార్జిగా కావ్యను నియమించిన సందర్భంగా మంగళవారం ముసునూరులోని ఆయన నివాసం వద్ద రాజకీయ కోలాహలం కొనసాగింది. కావలి పట్టణ, రూరల్ మండల టీడీపీ కమిటీల బాధ్యులు కావ్య క్రిష్ణారెడ్డిని కలిసి పూలమాలలు, బొకేలు, శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు గుత్తికొండ కిషోర్, ప్రధాన కార్యదర్శి జ్యోతి బాబూరావు, రూరల్ మండల అధ్యక్షుడు ఆవుల రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి ఉప్పాల వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

● సైకిల్ యాత్ర ప్రారంభం

కావ్య క్రిష్ణారెడ్డికి టీడీపీ కావలి ఇన్‌చార్జి పదవి వస్తే సైకిల్‌పై కసుమూరు దర్గాకు వస్తామని ఆయన అభిమానులు ఫిరోజ్, లక్ష్మణరావులు మొక్కుకున్నారు. ఈ మేరకు వారు మంగళవారం సైకిల్ యాత్ర చేపట్టగా క్రిష్ణారెడ్డి ప్రారంభించి వారిని అభినందించారు.

● కావ్య కృష్ణారెడ్డిని కలసిన బోగోలు నేతలు

బిట్రగుంట : టీడీపీ కావలి ఇన్‌చార్జిగా నియమితులైన కావ్య కృష్ణారెడ్డిని మంగళవారం బోగోలు, విశ్వనాథరావుపేట పంచాయతీలకు చెందిన మాజీ ఉపసర్పంచు దొడ్ల అంజయ్య యాదవ్, నాయకులు సాతుపాటి ఉదయ్‌కుమార్, బచ్చు మధుసూదన్‌రావులు కావలిలో కలసి సన్మానించారు. వారి వెంట రమేష్, సురేష్ తదితరులు ఉన్నారు.

10న మెగా రక్తదాన శిబిరం

కావలి, ఫిబ్రవరి 6: రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ఈనెల 10న మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు డిపో మేనేజరు శ్రీనివాసులు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆర్టీసీ డిపో ఆవరణలో రక్తదానంపై కార్మికులకు అవగాహన కల్పిస్తూ బ్యానర్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ ఈనెల 10న మెగా రక్తదాన శిబిరాలు నిర్వహిస్తోందని, అందులో భాగంగా కావలి డిపోలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజరు (ట్రాఫిక్) కేవీఆర్ బాబు, సీనియర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎం.రామకృష్ణ, సీనియర్ అసిస్టెంట్ కే.రవికుమార్, డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటీవ్ డీ.రవిప్రకాష్, ఎం.మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో పన్నులు చెల్లించండి

ఉదయగిరి : ప్రజలు సకాలంలో ఇంటి, కుళాయి పన్నులు చెల్లించి పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని శకునాలపల్లి సర్పంచి కల్లూరి వెంకటేశ్వర్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పారిశుధ్యం మెరుగు, వీధిదీపాల నిర్వహణకు పన్నులు చెల్లించాలని కోరారు.

ఓట్ ఫర్ ఓపీఎస్ పోస్టర్ ఆవిష్కరణ

సీతారామపురం : యూటీఎఫ్ రాష్ట్రశాఖ పిలుపు మేరకు స్థానిక మండల విద్యావనరుల కార్యాలయం వద్ద మంగళవారం 'మన ఓటు- మన భవిష్యత్తు'అనే నినాదంతో ఓట్ ఫర్ ఓపీఎస్ పోస్టర్లను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మండల యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి జీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం సీపీఎస్‌ను వారంలో రద్దు చేస్తామని చెప్పి నాలుగున్నరేళ్లు అయినా రద్దు చేయకపోగా, జీపీఎస్‌ను ప్రవేశపెట్టి ఉద్యోగులకు తీరని అన్యాయం చేసిందన్నారు. కార్యక్రమంలో నాయకులు తిరుపతయ్య, పేరాల శ్రీనివాసులు, బాలకృష్ణారెడ్డి, అన్నంగి ప్రసాద్,సుబ్బారావు, లక్ష్మయ్య, సురేష్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక రీచ్‌లో ఆగని అక్రమ వసూళ్లు

అనంతసాగరం, ఫిబ్రవరి 6: మండలంలోని పడమటి కంభంపాడు ఇసుకరీచ్‌లో వాహనాల వద్ద అక్రమ వసూళ్ల కొనసాగుతూనే ఉన్నాయి. రీచ్‌లో రహదారుల ఏర్పాటు కోసం సిబ్బంది అక్రమార్జనకు తెరలేపడంతో ఇసుక కొనుగోలుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏవేవో కారణాలు చెప్పి ట్రాక్టర్‌కు రూ.500, టిప్పర్, లారీలకు రూ. 1500 నుంచి రూ. 2000 వరకు వసూలు చేస్తున్నారు. అడ్డుకోవాల్సిన అధికారులు తమకేమి తెలియనట్లు మౌనం దాల్చడం విమర్శలకు తావిస్తుంది.ఈ అక్రమ వసూళ్లను సీపీఎం నాయకులు తప్పుపట్టారు. వసూళ్లు ఆపకపోతే ఆందోళన చేస్తామని వారు హెచ్చరించారు.

బెల్టు దుకాణాలు నిర్వహిస్తే కఠిన చర్యలు

అనంతసాగరం, ఫిబ్రవరి 6: గ్రామాల్లో మద్యం బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఆత్మకూరు సీఐ వేణు హెచ్చరించారు. మంగళవారం అనంతసాగరం పోలీసుస్టేషన్‌ను సందర్శించి, రికార్డులు పరిశీలించారు. ఎన్నికలు సమీపిస్తున్న క్రమంలో శాంతిభద్రతలు కాపాడేలా ప్రతేక శ్రద్ధ చూపాలన్నారు. చోరీలు జరగకుండా నిఘా పెంచాలని సిబ్బందిని ఆదేశించారు.

ఓపీఎస్ అమలు చేసేవారికే మా ఓటు

అనంతసాగరం, ఫిబ్రవరి 6: ఓపీఎస్ అమలు చేసే వారికే తమ ఓటు వేస్తామని యూటీఎఫ్ తేల్చి చెప్పింది. మంగళవారం అనంతసాగరంలో మండల అధ్యక్షుడు వీ వెంకటేశ్వర్లురెడ్డి ఆధ్వర్యంలో ఓపీఎస్ అమలు చేసేవారికి మాఓట్లు అనే వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేసిన మోసాన్ని ఎండగట్టారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు గౌస్‌బాష, శ్రీలత, అరుణశ్రీ, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

నేడు నందీశ్వరుడికి అభిషేక మహోత్సవం

సంగం, ఫిబ్రవరి 6: బహుళ త్రయోదశి మాసశివరాత్రిని పురస్కరించుకుని సంగమేశ్వరాలయంలోని నందిశ్వరుడికి బుధవారం సాయంత్రం అభిషేక మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. సాయంత్రం 4 నుంచి ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. పాల్గొనే భక్తులు పాలు, పెరుగు తెచ్చుకోవాలని ప్రధానార్చకులు గోపాలకృష్ణమూర్తి తెలిపారు.

సచివాలయాల తనిఖీ

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 6: మండలంలోని జీ.చెరువుపల్లి, బండగానిపల్లి, శకునాలపల్లి సచివాలయాలను మంగళవారం ఎంపీడీవో దేవరకొండ ఈశ్వరమ్మ తనిఖీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతిరోజు సచివాలయంలో స్పందనను నిర్వహించాలన్నారు. అనంతరం సిబ్బంది మూమెంట్, అటెండెన్స్ రిజిస్టర్లను పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జలసంఘ కమిటీలు ఏర్పాటు చేయాలి

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 6: జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా గ్రామాల్లో జలసంఘ కమిటీలను ఏర్పాటు చేయాలని ఏపీఎం సయ్యద్ ఖాజారంతుల్లా పేర్కొన్నారు. మంగళవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో సీసీలు, వీవోఏలతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కమిటీల ఏర్పాటుతోపాటు బ్యాంకు ఖాతాలను ప్రారంభించాలన్నారు.

వెంకటగిరిలో బీసీలకు అవకాశం ఇవ్వండి

కలువాయి, ఫిబ్రవరి 6 : వెంకటగిరి నియోజకవర్గం నుంచి టీడీపీ తరఫున బీసీలకు అవకాశం కల్పించాలని పలువురు బీసీ నాయకులు కోరారు. మంగళవారం కలువాయిలో వారు విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలో బీసీల జనాభా ఎక్కువగా ఉందని, బీసీ అభ్యర్థికి అవకాశం ఇస్తే తామంతా ముందుండి గెలిపించుకుంటామని తెలిపారు. టీడీపీ అధినేత చంద్రబాబు ఈ విషయాన్ని పరిశీలించాలని వారు కోరారు. సమావేశంలో టీడీపీ సీనియర్ నేత అల్లంపాటి వేణుగోపాల్‌రెడ్డి బీసీ నాయకులు ఏ.మల్లికార్జునయ్య, నూటేటి నరసింహులు, సంకల రఘురాం, కండే శ్రీనివాసులు, చెంచురామయ్య పాల్గొన్నారు.

వైసీపీ నేతలే భూకబ్జాదారులు

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), ఫిబ్రవరి 6: మండలంలో ప్రభుత్వ భూములను అక్రమిస్తూ వైసీపీ నేతలే కబ్జాదారులుగా మారుతున్నారని క్లస్టర్ ఇన్‌చార్జి కండ్లగుంట వెంకటరెడ్డి, మాజీ జడ్పీటీసీ చీదర్ల మల్లికార్జున్‌లు పేర్కొన్నారు. మంగళవారం టీడీపీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. కొంతమంది అక్రమార్కులు, అధికారులు చేతులు కలిపి దుత్తలూరు రెవెన్యూ పరిధిలోని 448-1 సర్వేనెంబర్‌లో రూ.4 కోట్ల విలువైన 32 ఎకరాల గర్భకండ్రిక భూమిని అక్రమించి యథేచ్ఛగా రిజిస్ట్రేషన్ చేయించారన్నారు. సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు చేపట్టాలన్నారు. లేకుంటే ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు కాకర్ల మధుసూదన్‌రెడ్డి, చప్పిడి హజరత్తయ్యయాదవ్, సింగవరపు సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైద్యసేవలు సద్వినియోగం చేసుకోవాలి

వరికుంటపాడు : ఆరోగ్య సురక్ష వైద్యసేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో శ్రీ దేవి అన్నారు. మంగళవారం రామాపురం సచివాలయం ప్రాంగణంలో నిర్వహించిన శిబిరంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో సచివాలయాల కన్వీనర్ దారపనేని చెన్నారాయుడు, మాజీ సర్పంచి మేడసాని చెన్నకేశవులు, వైద్యులు కరీష్మా, కోటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి ప్రభుదాస్, సీహెచ్‌వో రాజశేఖర్‌రాజు పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

వరికుంటపాడు, ఫిబ్రవరి 6: స్థానిక జాతీయ రహదారి సమీపంలో పద్మావతి, గోదాదేవి సమేత వెంకటేశ్వరుడి ఆలయానికి ప్రాణప్రతిష్ఠ చేయనున్నట్లు వ్యవస్థాపకుడు పెండ్యాల సూర్యనారాయణ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 15 నుంచి ఐదు రోజులపాటు ప్రతిష్ఠా మహోత్సవాలను నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా మహోత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కలిగిరి తహసీల్దారుగా బాలకిషోర్



కలిగిరి, ఫిబ్రవరి 6: కలిగిరి తహసీల్దారుగా బాలకిషోర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల నేపథ్యంలో జరిగిన బదిలీలలో ఆయన ప్రకాశం జిల్లా సీఎస్ పురం మండలం నుంచి ఇక్కడకు వచ్చారు.

సమన్వయంతో పని చేయాలి

● కందుకూరు సబ్ కలెక్టరు విద్యాధరి



మాట్లాడుతున్న సబ్ కలెక్టరు విద్యాధరి

కందుకూరు, ఫిబ్రవరి 6: రోడ్డు ప్రమాదాలు నానాటికీ పెరుగుతున్న తరుణంలో రహదారి భద్రతపై వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయటం ద్వారా రోడ్డు ప్రమాదాలను తగ్గించవచ్చని కందుకూరు సబ్ కలెక్టరు జీ.విద్యాధరి పేర్కొన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాలలో భాగంగా స్థానిక లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యాలయం వద్ద మంగళవారం లారీ ఓనర్లు, డ్రైవర్లు, ఆటో డ్రైవర్లు, మ్యాక్సీ క్యాబ్, మోటారుక్యాబ్ డ్రైవర్లకు అవగాహనా సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో సబ్ కలెక్టరుతో పాటు రవాణాశాఖ గుంటూరు ప్రాంతీయ సంయుక్త కమిషనర్ బి.కృష్ణవేణి పాల్గొని రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, పాటించాల్సిన ప్రమాణాలపై అవగాహన కల్పించారు. వైద్యశిబిరం ఏర్పాటు చేసి డ్రైవర్లకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో కావలి ప్రాంతీయ రవాణాశాఖ అధికారి వై.సుధాకరరెడ్డి, నెల్లూరు ఎన్ఫోర్స్‌మెంట్ ఎంవీఐ గోపినాయక్, కావలి, కందుకూరు ఎంవీఐలు, ఆర్. సుందరరావు, ఎస్కే మహమ్మద్ రఫీ, కందుకూరు ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టరు ఎం.శకుంతల, డాక్టరు ప్రశాంతి, డాక్టరు మధుసూదనరాజు, లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు నాగేశ్వరరావు, గోపి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సర్వే చేశాకే నిర్మాణ పనులు చేయండి

సర్వేచేసి హద్దులు నిర్ణయించకుండా వంకర్లు తిప్పుతూ మురుగు నీటి కాలువ నిర్మించడం ఏమిటని మున్సిపల్ అధికారులపై సబ్ కలెక్టరు జీ. విద్యాధరి ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణం సర్వేచేసి హద్దులు నిర్ణయించాక కాలువ నిర్మాణం చేయాలని, అంతవరకు పనులు నిలిపివేయాలని ఆదేశించారు. పట్టణంలోని బండపాలెం, శ్రీరాంనగర్ కాలనీ ప్రాంతాలలో నిర్మిస్తున్న మురుగు కాలువను మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కొలతలు వేసి ఇంజనీరింగ్ అధికారులు మార్కింగ్ ఇవ్వకుండా పనులు ఎలా ప్రారంభించారని కాంట్రాక్టరును ప్రశ్నించారు. నిబంధనల ప్రకారం నిర్మాణ పనులు జరిగేలా పర్యవేక్షించాలని, లేనిపక్షంలో కఠినచర్యలు తీసుకుంటామని ఇంజనీరింగ్ అధికారులను హెచ్చరించారు. ఆమె వెంట మున్సిపల్ కమిషనర్ కేవీ కృష్ణారెడ్డి, ఇంజనీరింగ్ అధికారులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో గంధమహోత్సవం



ప్రార్థన చేస్తున్న ఎమ్మెల్యే మహీధరరెడ్డి

కందుకూరు, ఫిబ్రవరి 6: పట్టణంలోని శ్రీశ్రీశ్రీ హజరత్ సయ్యద్ జహంగీర్ మలంగ్‌షా అవులియా గంధ మహోత్సవం సోమవారం రాత్రి భక్తిశ్రద్ధలతో జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మానుగుంట మహీధరరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావులు వేర్వేరుగా పాల్గొన్నారు. మతపెద్దలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.



గంధమహోత్సవంలో ఇంటూరి నాగేశ్వరరావు

పొగాకు బ్యారన్ దగ్ధం : రూ.2 లక్షల నష్టం



మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

లింగసముద్రం, ఫిబ్రవరి 6 : మండలంలోని తిమ్మారెడ్డిపాలెంలో పొగాకు బ్యారన్ దగ్ధమై రూ.2 లక్షల నష్టం వాటిల్లింది. వివరాల మేరకు.. పొగాకు రైతు నలబోలు వెంకటేశ్వర్లుకు చెందిన బ్యారన్‌లో మంగళవారం ఉదయం 6.30 గంటల సమయంలో అల్లుడు కర్ర జారి పొగ గొట్టంపై పడి మంటలు వ్యాపించాయి. ఈ మంటలు కొద్దిసేపటికే బ్యారన్ లోపల చుట్టుముట్టాయి. దీంతో స్థానికులు కందుకూరు అగ్నిమాపక కేంద్రానికి సమాచారమిచ్చారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి బ్యారన్‌లోని మంటలను ఆర్పివేశారు. కానీ అప్పటికే బ్యారన్‌లోని 1300 పొగాకు అల్లుడు కర్ర, టైర్లు, పొగ గొట్టాలు కాలిపోయాయని బాధిత రైతు చెప్పారు. ఈ ఘటనలో సుమారు రూ.2 లక్షలు నష్టం జరిగిందని ఆవేదన చెందారు. పొగాకు బోర్డు అధికారులు తనను ఆదుకోవాలని కోరారు.


భవన నిర్మాణ కార్మికులకు అండగా ఉంటాం



కార్మికులతో జనసేన నాయకులు సిద్ధు

కావలిటౌన్, ఫిబ్రవరి 6: భవన నిర్మాణ కార్మికులకు జనసేన అండగా ఉంటుందని ఆ పార్టీ నాయకులు సిద్ధు పేర్కొన్నారు. మంగళవారం ఉదయం జనంలోకి జనసేన 181వ రోజు కార్యక్రమంలో భాగంగా లత థియేటర్ సెంటర్‌లో కార్మికులతో జనసేన శ్రేణులు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా సిద్ధు మాట్లాడుతూ జగన్ పాలనలో ఇసుక, గ్రావెల్ కొరతతో నిర్మాణ పనులు లేక ఉపాధి కోల్పోయి వేలాదిమంది కార్మికులు హైద్రాబాద్, చెన్నైకు వలసలు పోతున్నారని ఆరోపించారు. రాబోయేది జనసేన, టీడీపీ ప్రభుత్వమని, భవన నిర్మాణ కార్మికులకు పవన్‌కల్యాణ్ అండగా నిలబడతారన్నారు. కార్యక్రమంలో జనసేన జిల్లా కార్యదర్శి సమ్మెన వెంకటసుబ్బయ్య, సీనియర్ కాపు నాయకులు తోట శేషయ్య, బెల్లంకొండ వెంకటేశ్వర్లు, రూరల్ అధ్యక్షుడు తిరుపతిస్వామి, పుల్లయ్య, సాయి, లక్ష్మణ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కరించండి



మాట్లాడుతున్న విశ్రాంత న్యాయాధికారి శ్రీనివాస ఆంజనేయమూర్తి

కావలిటౌన్, ఫిబ్రవరి 6: విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కరించాలని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక చైర్‌పర్సన్ వి శ్రీనివాస ఆంజనేయమూర్తి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని వెంగళరావునగర్‌లోని విద్యుత్ ఈఈ కార్యాలయం ఆవరణలో ఈఈ జెనర్జీ పర్యవేక్షణలో ప్రత్యేక విద్యుత్ అదాలత్ జరిగింది. ఈ అదాలత్‌కు కేవలం నలుగురే రావడంతో వేదిక బాధ్యులు ఉదయం 11-30 నుంచి మధ్యాహ్నం 1-30 గంటల వరకు ఎదురు చూసి కార్యక్రమాన్ని మమ అనిపించారు. కార్యక్రమంలో కే.రామమోహనరావు, అంజనీకుమార్, జీ.ఈశ్వరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ రిటైరీ సంక్షేమ సంఘం డైరీ ఆవిష్కరణ

కావలిటౌన్, ఫిబ్రవరి 6: కావలి డివిజన్ రెవెన్యూ రిటైరీ సంక్షేమ సంఘం డైరీని ఆర్డీవో శీనానాయక్ మంగళవారం ఆర్డీవో కార్యాయలంలో ఆవిష్కరించారు. సంఘం డివిజన్ అధ్యక్షుడు, విశ్రాంత డిప్యూటీ తహసీల్దారు మొగల్ సిరాజ్‌బేగ్, కార్యదర్శి ఎం.సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమంలో ఆర్డీవో మాట్లాడుతూ విశ్రాంత రెవెన్యూ సిబ్బంది సంక్షేమ సంఘంగా ఏర్పడి సభ్యుల సంక్షేమం కోసం పాటుపడడం అభినందనీయమన్నారు. సంఘానికి తన పూర్తి సహాయ సహకారాలు అందిస్తానన్నారు. అనంతరం ఆర్డీవో, తహసీల్దారు, సబ్ ట్రెజరీ అధికారి జగజ్జీవన్‌రామ్, సభ్యులకు డైరీలు పంపిణీ చేశారు.

జగన్‌ది వైఫల్య పాలన : ఇంటూరి

కందుకూరు, ఫిబ్రవరి 6: రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డిది పూర్తిగా వైఫల్య పాలన అని, ఆయన అనాలోచిత విధానాలతో యువత నిర్వీర్యం అవుతోందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు విమర్శించారు. రాష్ట్రానికి రాజధాని లేకుండా చేయడమే గాక యువతకు ఉద్యోగాలు లేకుండా చేసి వారిని మత్తు పదార్థాలకు బానిసలను చేశాడని పేర్కొన్నారు. బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా కోవూరు రోడ్డులో మంగళవారం ఆయన పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించి మినీ మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం హామీని ఇచ్చిన ఎమ్మెల్యే మహీధరరెడ్డి విస్మరించారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు దామా మల్లేశ్వరరావు, ముచ్చు శ్రీను, మచ్చా మనోహర్, పువ్వాడి రమేష్, నందనవనం రాము, శేఖర్, నందికనమల లక్ష్మణరావు, పీలా శ్రీనివాసులు, బొట్ల గూడూరి శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎంవో నుంచి 'వంటేరు'కు పిలుపు

జలదంకి, ఫిబ్రవరి 6: కావలి మాజీ ఎమ్మెల్యే, వైసీపీ రాజకీయ సలహాదారుడు వంటేరు వేణుగోపాల్‌రెడ్డికి సీఎంవో కార్యాలయం నుంచి మంగళవారం పిలుపు వచ్చింది. దీంతో ఆయన అమరావతికి వెళ్లారు. బుధవారం సీఎం జగన్‌ను తాడేపల్లిలోని ఆయన నివాసంలో కలవనున్నారు. కొంతకాలంగా సీఎం అపాయింట్‌మెంట్ కోసం ప్రయత్నించిన వంటేరుకు ఎట్టకేలకు పిలుపు వచ్చింది. వంటేరు ఉదయగిరి వైసీపీ టికెట్ ఆశిస్తుండడం, సీఎంవో నుంచి పిలుపు రావడంతో రాజకీయవర్గాల్లో చర్చనీయాంశమైంది.

బస్ షెల్టర్ ప్రారంభం

కొండాపురం, ఫిబ్రవరి 6: మండలంలోని సాయిపేటలో దాతల సహకారంతో నిర్మించిన బస్ షెల్టర్‌ను సర్పంచు కోటేశ్వరమ్మ మంగళవారం ప్రారంభించారు. గ్రామానికి చెందిన చిమట నర్సయ్య, కామ్రేడ్ గంటా లింగయ్యల జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు, గ్రామంలోని యువకులు సంయుక్తంగా ప్రయాణికుల సౌకర్యార్థం బస్ షెల్టర్ నిర్మించారు. ఈ కార్యక్రమంలో నర్సయ్య సతీమణి భూశమ్మ, లింగయ్య సతీమణి అనుసూయమ్మ, చిమట వెంకటేశ్వర్లు, గంటా శ్రీనివాస్ ప్రసాద్, సామాజిక కార్యకర్త ఎమ్.మాలకొండారెడ్డి, బి.వెంకటేశ్వర్లు, జయంపు కనకయ్య పాల్గొన్నారు.

జగన్‌తోనే చిరువ్యాపారుల సంక్షేమం

కావలిటౌన్, ఫిబ్రవరి 6: జగనన్నతోనే చిరువ్యాపారుల సంక్షేమం సాధ్యమని ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ట్రంకురోడ్డు మార్జిన్‌లో వ్యాపారాలు చేసుకునే చిరువ్యాపారుల వద్దకు ఎమ్మెల్యే వెళ్లి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట వైసీపీ నేతలు శివకుమార్ రెడ్డి, కనమర్లపూడి నారాయణ, వడ్లమూడి వెంకటేశ్వర్లు, షేక్ చెన్నయ్య, నున్నా మురళీ పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలి

కావలి రూరల్, ఫిబ్రవరి 6: ప్రతి ఒక్కరు రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని జూనియర్ రెడ్‌క్రాస్ విభాగం కన్వీనర్ ఏవీ హనుమకుమార్ పేర్కొన్నారు. మండలంలోని మాతినవారిపాలెం ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం రక్తదానంపై అవగాహనంపై అవగాహన కార్యక్రమం జరిగింది. విద్యార్థులకు రక్త గ్రూపు నిర్ధారణ పరీక్షలు చేశారు. అనంతరం విద్యార్థులకు రక్తదానంపై అవగాహన కల్పించేందుకు ఉపాధ్యాయులు రాధాక్రిష్ణ, రామచంద్ర, రమణకుమార్, పూర్వ విద్యార్థులు వంశీక్రిష్ణ, భాస్కర్, శ్రీనివాస్ తదితరులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుచరిత, ప్రభాకర్, జగన్మోహన్ పాల్గొన్నారు.

నెల్లూరు సిటీ, రూరల్
కోవూరు, సర్వేపల్లి



రాకపోకలు సాగించే వీల్లేకుండా తవ్విన రోడ్డు

పైపులైన్ల గోతులతో ప్రమాదాలు



జొన్నవాడలో సీసీ రోడ్డు తవ్వి పైపులైను వేసి పూడ్చని గోతులు

బుచ్చిరెడ్డిపాళెం, ఫిబ్రవరి 6: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన జలజీవన్ పథకం జొన్నవాడ ప్రజల పాలిట శాపమైంది. ఈ పథకం కింద గ్రామంలో తాగునీటి పైపులైన్ల నుంచి కుళాయి కనెక్షన్ తీసుకున్నా, పైపులైను వేసేందుకు తీసిన గోతులు పూడ్చినా జైలుకేనని కాంట్రాక్టర్ అనుచరులు చెప్పడంతో గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. కాంట్రాక్టర్ పలు వీధుల్లో గోతులు పూడ్చకుండానే వదిలేశారు. 10రోజులుగా పైపులైన్ల కోసం తీసిన గోతుల్లో పడి ప్రజలు, చిన్నా ప్రమాదాలకు గురౌతున్నారు. అయినా అధికారులు పట్టించుకోకుండా ముఖం చాటేశారు. పైపులైన్లు వేసిన వెంటనే గోతులు పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు. కాగా ప్రజల తాగునీటి సమస్యలు తీర్చడమే జలజీవన్ పథకం లక్ష్యమని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వినయ్ తెలిపారు. పైపులైన్ వేస్తుండగా ఓ ప్రాంతంలో కొందరు గౌరవంలేకుండా మాట్లాడారని, ఎవరికీ సమాధానం చెప్పాల్సిన అవసరంలేదని ఆ శాఖ డీఈ అన్నారు.

అక్కంపేటలో ఆరోగ్య సురక్ష

మనుబోలు, ఫిబ్రవరి 6: మండలంలోని అక్కంపేట పంచాయతీలో మంగళవారం అధికారులు జగనన్న ఆరోగ్య సురక్ష 2.0 కార్యక్రమాన్ని నిర్వహించారు.స్థానిక పీహెచ్‌సీ వైద్యురాలు గేయపూజిత శిబిరంలో వైద్యచికిత్సలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో జీవీఎస్‌వీ ప్రసాద్, కార్యదర్శి వెంకటరమణ, వైద్యులు మొహసీనా సుల్తానా, సీహెచ్‌వో రాజయ్య పాల్గొన్నారు.

వరి పొలాల పరిశీలన

వెంకటాచలం, ఫిబ్రవరి 6 : మండలంలోని సర్వేపల్లి, ఇస్కపాళెం, నిడిగుంటపాళెం, పుంజులూరుపాడు, తాటిపర్తిపాళెం గ్రామాల్లోని వరి పొలాలను మంగళవారం వ్యవసాయ శాస్త్రవేత్తల బృందం పరిశీలించింది. రైతులకు సూచనలిచ్చారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ పరమశివ, డీ విజయకుమార్ నాయక్, సహాయ వ్యవసాయ సంచాలకులు జీ లక్ష్మీమాధవి, ఎన్ శ్రీనివాసులు, మండల వ్యవసాయ శాఖాధికారి డీ హరికరుణాకర్‌రెడ్డి, వ్యవసాయ సహాయకులు పీ యశ్వంత్, ఎన్ శంకరయ్య, జీ ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

గిరిజన యువకుడి కుటుంబానికి ఆర్థిక సాయం

సైదాపురం,ఫిబ్రవరి6: మండల పరిధిలోని తుమ్మలతలుపూరు గిరిజన కాలనీలో పంతగిరి శ్రీనివాసులు(25) అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన దహన సంస్కారాల కోసం కుటుంబ సభ్యులకు మంగళవారం రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని కొమ్మిశ్రీనివాసులు చౌదరి చేతుల మీదుగా అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రేషన్ కార్డులో కుటుంబ యజమాని కాకపోవడంతో వైఎస్ ఆర్ బీమా కూడా అందే పరిస్థితి లేకపోవడంతో ఎంసీ ట్రస్ట్ తరఫున మెట్టుకూరు ధనుంజయ్‌రెడ్డి దాతృత్వంతో ఆర్థిక సాయం అందచేశామన్నారు.

వెంకటగిరి టికెట్ బీసీలకు కేటాయించాలి

రాపూరు(డక్కిలి), ఫిబ్రవరి 6 : వెంకటగిరి టీడీపీ టికెట్ బీసీలకు కేటాయించాలని రాపూరు మండల మాజీ టీడీపీ అధ్యక్షుడు గంగోటి ఆనంద్, స్థానిక టీడీపీ నాయకుడు తుమ్మలపల్లి మధుసూదనరావులు కోరారు. మంగళవారం వారు రాపూరులో విలేకరులతో మాట్లాడారు. వెంకటగిరి నియోజకవర్గంలో బీసీ జనాభా అధిక సంఖ్యలో ఉన్నారని గుర్తుచేశారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని చంద్రబాబు నాయుడు టికెట్ విషయంలో పునరాలోచించాలని విజ్ఞప్తి చేశారు. వెంకటగిరి టికెట్ బీసీలకు ఇస్తే గెలుపు నల్లేరుపై నడకేనని అన్నారు. కార్యక్రమంలో నాయకులు ఖాదర్‌బాషా, చంద్రారెడ్డి, ముప్పాళ చిన్నా, సుబ్బయ్య, సుబ్రహ్మణ్యం, నాగయ్య, కోటి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ నులిపురుగుల దినోత్సవంపై అవగాహన

బుచ్చిరెడ్డిపాళెం, ఫిబ్రవరి 6: ఈనెల 9వ తేదీన జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీడీవో రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం జరిగింది. ఎంఈవో, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులకు వైద్యాధికారులు నులిపురుగు మాత్రలు పంపిణీ చేశారు. ఈ సమావేశంలో వైద్యాధికారి నవీన్, ఎంఈవో పీవీ.రత్నం, బాలికోన్నతపాఠశాల హెచ్‌ఎం సుజాత, సీఆర్‌పీ మల్లేశ్వరరెడ్డి, సీహెచ్‌వో సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులు పేర్లు నమోదు చేసుకోవాలి

బుచ్చిరెడ్డిపాళెం, ఫిబ్రవరి 6: పారిశుధ్య కార్మికుల జీవన భద్రత, మెరుగైన ఉపాధి కల్పనే ధ్యేయంగా సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం సంయుక్తంగా నిర్వహిస్తున్న (ఎన్‌ఏఎంఏఎస్‌టీఈ) నేషనల్ యాక్షన్ ఫర్ మెకనైజ్డ్ శానిటేషన్ ఎకోసిస్టమ్ స్కీంలో వారి పేర్లు నమోదు చేసుకోవాలని నగర పంచాయతీ కమిషనర్ రమణబాబు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పైలెట్ ప్రాజెక్టును స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ అధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ రూపొందించిన మేరకు బుచ్చి నగర పంచాయతీలో ప్రత్యక్షంగా, పరోక్షంగా పాల్గొంటున్న పారిశుధ్య కార్మికులు, సెప్టిక్ ట్యాంకు డ్రైవర్లు, హెల్పర్లు వారి వివరాలను నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

ఆర్‌ఎంపీ వైద్యుల ఆగడాలకు అడ్డుకట్ట లేదా!?

● అధిక ఫీజులతో అల్లాడుతున్న ప్రజలు

తోటపల్లిగూడూరు, ఫిబ్రవరి 6: మండలంలో అనుమతులు లేకుండా క్లినిక్‌లు నిర్వహిస్తున్న ఆర్‌ఎంపీ వైద్యులపై చర్యలు తీసుకోవడంలో వైద్య అధికారులు విఫల మయ్యారని పలువురు ఆరోపిస్తున్నారు. కోడూరు, వరిగొండ పీహెచ్‌సీ కేంద్రాలు, గ్రామాల్లో ఏఎన్‌ఎంలు, నర్సులు రోగపీడితలను పట్టించుకోకపోవడంతో వైద్యంకోసం వారు ఆర్‌ఎంపీ వైద్యులను ఆశ్రయిస్తున్నారు. దీంతో వారు పెద్ద మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్నారు. ఇటీవల ఇసుకపాలెం సెంటర్‌లో ఆర్‌ఎంపీ డాక్టర్ వల్ల నిండు ప్రాణం బలైంది. ముఖ్యంగా మహాలక్ష్మీపురం, సాలిపేట, ఇసుకపాలెం సెంటర్, వరి గొండ గ్రామాల్లో ఆర్‌ఎంపీలు ప్రజలకు వైద్యం అందిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఆర్‌ఎంపీ వైద్యుల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

సీలింగ్ భూమికి పట్టా ఎలా ఇస్తారు ?



సీలింగ్ భూముల్లో శ్యాంసుందర్‌రెడ్డి ఏర్పాటు చేసిన బోర్డు

తోటపల్లిగూడూరు, ఫిబ్రవరి 6 : సీలింగ్ భూమికి పట్టా ఎలా ఇస్తారని స్థానిక రైతు శ్యామ్‌సుందర్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇదంతా అధికార పార్టీ అండదండలతో రెవెన్యూ అధికారులు చేస్తున్నారని ఆయన వివరించారు. ఈ మేరకు ఆయన వివాదాస్పద భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. కోడూరు లోని సర్వే నెంబరు 497లోని ప్రభుత్వ భూములు పట్టా భూములుగా మారి ఇబ్బందులకు గురి చేస్తున్నాయన్నారు. 1973 సీలింగ్ చట్టం ప్రకారం పెమ్మారెడ్డి పిచ్చి రెడ్డి సీలింగ్ కింద కొంత భూమిని వదిలేశారని, 2017లో గత రికార్డులు ఏమీ చూడ కుండా రెవెన్యూ అధికారులు అడంగల్ సృష్టించినట్లు ఆయన తెలిపారు. ఈ విషయమై తాను సమాచార హక్కు చట్టం కింద వివరాలు సేకరించి, పలుమార్లు రెవెన్యూ అధికారులకు విజ్ఞప్తులు చేసినా పట్టించుకోలేదన్నారు. ఈ విషయమై కోర్టును ఆశ్రయించానని, కోర్టులో కేసు విచారణలో ఉన్నందున ఎవరూ లావాదేవీలు నిర్వహించరాదన్నారు.

దళితులే లక్ష్యంగా వైసీపీ దాడులు

● టీడీపీ కోవూరు ఇన్‌చార్జి దినేష్‌రెడ్డి



బుచ్చిరెడ్డిపాళెం 3వ వార్డులో దినేష్‌రెడ్డికి సమస్యలు వివరిస్తున్న మహిళలు

బుచ్చిరెడ్డిపాళెం, ఫిబ్రవరి 6: దళితులే లక్ష్యంగా వైసీపీ ప్రభుత్వం దాడులకు పాల్పడుతుందని టీడీపీ కోవూరు నియోజకవర్గం ఇన్‌చార్జి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన బుచ్చి నగర పంచాయతీలోని 3వ వార్డులో ఆవార్డు ఇన్‌చార్జి వుసురుపాటి ప్రసాద్‌తో కలిసి ప్రతి అడుగు ప్రజల కోసం 94వ రోజు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ ఇంటికెళ్లినా సమస్యలపై ఏకరువుపెఉతున్నారని, రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి ఓట్లేసి చంద్రబాబునాయుడిని సీఎంగా గెలిపిస్తామని భరోసా ఇస్తున్నారన్నారు. జగన్మోహన్‌రెడ్డి నా బీసీలు, నా దళితులు, నా ఎస్‌టీలంటూ వారిపైనే దాడులకు దిగుతురన్నారు. రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి, కోవూరు యోజకవర్గంలో ప్రసన్నకుమార్‌రెడ్డి చేస్తున్న దందాలు గురించి స్వయానా ఆయన బంధువులే చెబుతున్నారని, వీటికి వారు సమాధానం చెపాలన్నారు. కాగా జిల్లాకు ఎస్‌జీటీ పోస్టులు జీరో చేసిందని ఎస్‌కే జరీనా అనే మైనారిటీ యువతి ఆవేదన వ్యక్తం చేసింది. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎంవీ.శేషయ్య, హరికృష్ణ, హరనాథ్, రామానాయుడు, చెముకుల చైతన్య, కల్యాణ్, ప్రభాకరరెడి, కే.కిషోర్, నరసయ్య, దశరథ మైనారిటీ, దళిత నాయకులు, పాల్గొన్నారు.

వీఎస్‌యూలో మహిళా ఉద్యోగుల టోర్నమెంట్



విజేతకు బహుమతి అందజేస్తున్న వీసీ సుందరవల్లి, రిజిస్ట్రార్

వెంకటాచలం, ఫిబ్రవరి 6 : మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న వీఎస్‌యూలో మంగళవారం అంతర్ కళాశాలల మహిళా ఉద్యోగుల గేమ్స్ టోర్నమెంట్ నిర్వహించారు. వీసీ సుందరవల్లి, రిజిస్ట్రార్ డాక్టర్ పీ రామచంద్రా రెడ్డిలు ఈ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. వీసీ మాట్లాడుతూ క్రీడలు ఆరోగ్యానికి ఎంతో దోహదం చేస్తాయన్నారు. కాగా త్రోబాల్ విజేతగా డాక్టర్ సీ విజయకళ జట్టు, రన్నర్‌గా ఎం అమ్మాజీ జట్టు గెలుపొందాయి. విజేతలకు వీసీ బహుమతులు అందచేశారు. కార్యక్ర మంలో వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ విజయానంద్‌కుమార్ బాబు, పరీక్షల నియంత్రణా ధికారి డాక్టర్ మధుమతి, స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ డాక్టర్ కే సునీత, ఆర్గనైజింగ్ సెక్రటరీ వై రవీంద్రమ్మ, డాక్టర్ ఏ ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

11న జేఏసీ సంఘాలతో ఉద్యమ కార్యాచరణ

● ఎన్జీవో సంఘం నాయకులు



మాట్లాడుతున్న మన్నేపల్లి పెంచలరావు

నెల్లూరు (హరనాథపురం), ఫిబ్రవరి 6 : ఈనెల 11న రాష్ట్ర స్థాయి కమిటీ సంఘాలను కలుపు కుని ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని ఏపీ ఎన్జీవో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మన్నేపల్లి పెంచలరావు తెలి పారు. నెల్లూరులోని ఎన్జీవో హోంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యా, కార్మిక పెన్షనర్ల సమస్యలను పరిష్కరించకపోతే సమ్మెకు వెళ్లడానికీ వెనుకాడబోమన్నారు. ఈ సమావేశంలో ఆ అసోసియేషన్ కార్యదర్శి నాయుడు వెంకటస్వామి, జిల్లా కోశాధికారి బండారుపల్లి వెంకటేశ్వర్లు, సహాధ్యక్షుడు నందిమం డలం అంజనేయవర్మ, ఆర్గనైజింగ్ కార్యదర్శి గాదిరాజు రామకృష్ణ పాల్గొన్నారు.

ఎన్జీవో నేతల ప్రకటన హాస్యాస్పదం

● ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సురేష్

ఏపీఎన్జీవో నేతల ప్రకటనలు హాస్యాస్పదంగా ఉన్నాయని, వాటిని నమ్మేస్థితిలో ప్రజలు లేరని ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి సురేష్ అన్నారు. నెల్లూరులోని ఓ భవనంలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులతో మంగళవారం సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఉద్యోగుల సమస్యలు పరిష్కరించటంలో ప్రభుత్వం విఫలమైనందున అవసరమైతే సమ్మె చేస్తామని ఏపీఎన్జీవో నేత బండి శ్రీనివాసరావు చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయన్నారు. ఉద్యమాలు ఎలా చేయాలో అంగన్వాడీలను చూసి ఎన్జీవో నేతలు తెలుసుకోవాలన్నారు. ఎన్నికల కోడ్ వచ్చే వేళ ఎన్నికల సంఘంపై ఉద్యమాలు చేస్తారా అని ప్రశ్నించారు. ఉద్యోగులకు ప్రభుత్వం చేయాల్సిన దానికంటే చాలా ఎక్కువే చేసిందంటూ గతంలో జగన్‌కు పాలాభిషేకం చేసిన ఎన్జీవో నేతలు ఇప్పుడు ప్రభుత్వం విఫలమైందంటూ ఉద్యోగులను మరోసారి రెచ్చగొట్టే ప్రకటనలు చేయటం శోచనీయమన్నారు. ఇప్పటికైనా ప్రధాన సమస్యల పరిష్కారంపై దృష్టిపెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో నేతలు మందా బాబీ, రాపూరి రమణయ్య, కొమ్మల కృష్ణయ్య, విడవలూరు శ్రీకాంత్, కొల్లూరు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం నిధులతోనే రాష్ట్రంలో పథకాలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఫిబ్రవరి 6: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలన్నీ కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సహకారంతోనే అమలవుతున్నాయని బీజేపీ రాష్ట్ర నాయకుడు భైరి శ్రీనివాస్ తెలిపారు. నగరంలోని ఏడవ డివిజన్ వీవర్స్ కాలనీలో మంగళవారం వికసిత భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం నవరత్నాల పేరుతో అమలు చేస్తున్న పథకాలన్నీ ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం ఇస్తున్న నిధులతోనే అని వివరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకుడు పీ సురేం ద్రరెడ్డి, డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, జిల్లా నోడల్ అధికారి నాగ సాయి సూరి, వికసిత భారత్ కార్యక్రమం సమన్వయకర్త చిన్నారెడ్డి శ్రీనివాసరెడ్డి, నాయకులు ఆదినారాయణ, శ్రీధర్, జై చంద్ర పాల్గొన్నారు.

కోటంరెడ్డి కుటుంబం ప్రచారం



వృద్ధుడితో మాట్లాడుతున్న కోటంరెడ్డి

నెల్లూరు (వ్యవసాయం) : వచ్చే ఎన్నికల్లో టీడీపీని ఆదరించాలని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కుటుంబ సభ్యులు ప్రజలను అభ్యర్థించారు. మంగళవారం 22వ డివిజన్ పాత వేదాయపాళెం, జనశక్తినగర్, సప్తగిరి కాలనీ, రాజు కాంప్లెక్స్, స్నేహ నగర్ ప్రాంతాల్లో కోటంరెడ్డి సతీమణి సుజిత మ్మ, కుమార్తెలు హైందవి, వైష్ణవి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాగా, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి చేపట్టిన ఒక్కడే ఒంటరిగా కార్యక్రమంలో భాగంగా మంగళవారం పార్టీ కార్యాలయంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో తనను ఆశీర్వ దించాలని కోరారు.

ఓటరు జాబితాలో లోపాలు సవరించకుంటే కోర్టుకెళ్తా

● 15వరకు అధికారులకు గడువు : నారాయణ



మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి నారాయణ, పక్కన అజీజ్, కోటంరెడ్డి

నెల్లూరు (సిటీ), ఫిబ్రవరి 6 : నెల్లూరు నగర నియోజకవర్గంలోని ఓటరు జాబితాలో తప్పిదాలను సవరించకుంటే కోర్టును ఆశ్రయిస్తానని టీడీపీ సిటీ ఇన్‌చార్జి పొంగూరు నారాయణ స్పష్టం చేశారు. మంగళవారం కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ వికాస్‌మర్మత్ నిర్వహించిన రాజకీయ పార్టీల సమావేశంలో పాల్గొన్న ఆయన అనంతరం మీడియాతో మాట్లాడారు. సిటీ నియోజకవర్గంలో ఇప్పటికీ 2,263 మంది ఓటర్లు డబుల్ ఎంట్రీలు ఉన్నాయని తెలిపారు. పైగా 16వ డివిజన్‌లో 14 మంది స్థానికంగా లేకపోయినా వారికి ఓట్లు ఉన్నట్లు జాబితాలో పొందుపరిచారన్నారు. ఈ విషయాన్ని వారం క్రితం అధికారుల దృష్టికి తీసుకొచ్చినా ఫలితం లేదని వాపోయారు. ఈ తప్పిదాలన్నిటినీ ఈ నెల 15వ తేదీలోపు సవరించి సరిచేయకుంటే కోర్టును ఆశ్రయిస్తానని వెల్లడించారు. బాధ్యులైన అధికారులందరూ కోర్టులో సమాధానం చెప్పాల్సి ఉంటుందన్నారు. ఆయన వెంట టీడీపీ నేతలు అబ్దుల్ అజీజ్, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఉచ్చి భువనేశ్వర ప్రసాద్, కరీముల్లా తదితరులు ఉన్నారు.

ప్రజలు కోరుకునేది అభివృద్ధినే..! : నారాయణ

నెల్లూరు (వైద్యం) : ప్రజలు కోరు కునేది అభివృద్ధిని, సంక్షేమ కార్యక్రమాలనే అని మాజీ మంత్రి, టీడీపీ నేత పొం గూరు నారాయణ అన్నారు. నగరంలోని 16వ డివిజన్‌లో మంగళవారం జరిగిన బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన ఇంటింటికి తిరిగి వైసీపీ ప్రభుత్వ వైఫల్యాల ను వివరించారు. టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కరిముల్లా, తాళ్లపాక అనూరాధ, విజేతరెడ్డి, మామిడాల మధు, పెనుబర్తి సాయిరాం, మస్తానయ్య, మురళి తదితరులు పాల్గొన్నారు.

● నారాయణ సతీమణి పొంగూరు రమాదేవి 39వ డివిజన్ అలంకార్ సెంటర్ పరిసర ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో నారాయణను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు అన్నంగి ప్రసాద్, సుజనా, గోపిక, మురళీకృష్ణ సింగ్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

అధికారంలోకి రాగానే సమస్యల పరిష్కారం : అజీజ్

నెల్లూరు(వ్యవసాయం), ఫిబ్రవరి 6 : ప్రతి ఇంట్లో ఏదో ఒక సమస్య నెలకొని ఉందని, తెలు గుదేశం పార్టీ అధికారంలోకి రాగా నే ప్రజల సమస్యలన్నీ తీరుస్తామ ని ఆ పార్టీ నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ హామీ ఇచ్చారు. నగరంలోని 51వ డివిజన్ కపాడిపాళెంలో మం గళవారం బాబు ష్యూరిటీ - భవిష్య త్ గ్యారెంటీ కార్యక్రమం జరిగింది. అజీజ్ మాట్లాడుతూ టిడ్కో ఇళ్ల కోసం అప్పు తెచ్చి డిపాజిట్ కట్టా మని ప్రజలు చెబుతున్నారని, ఆ ఇళ్లను వారికి ఇచ్చేసి ఉంటే కనీసం ఇంటి బాడుగల భారం ఉండేది కాదని చెప్పారు. టీడీపీ అధికారం చేపట్టగానే పేదలకు ఇళ్లు కేటాయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మీదూరి ప్రశాంత్ కుమార్, కమతం ప్రశాంత్ కుమార్, బాలా, కుమార మంగళం, జానా వాసు, ఎంబెటి సందేశ్, వాదనాల నరేష్, బండి ప్రవీణ్‌కుమార్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు నగదు ప్రోత్సాహకాలు

నెల్లూరు (విద్య), ఫిబ్రవరి 6 : ఆడుదాం ఆంధ్రా క్రీడల్లో ప్రతిభ కనబరిచిన సర్వేపల్లి నియోజకవర్గ క్రీడాకారులకు వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కుమార్తె పూజిత నగదు ప్రోత్సాహకాలను అందచేశారు. నగరంలో పొదలకూరురోడ్డులోని మంత్రి నివాసం వద్ద మంగళవారం జరిగిన అభినందన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. జిల్లాస్థాయి ఆడుదాం ఆంధ్రా పోటీల్లో సర్వేపల్లి నియోజకవర్గం క్రీడాకారులు క్రికెట్, వాలీబాల్‌లో ప్రథమ, ద్వితీయ స్థానాలను, పురుషుల బ్యాడ్మింటన్ విభాగంలో ద్వితీయ, తృతీయ స్థానాలను సాధించారని చెప్పారు. మహిళా క్రికెట్ జట్టుకు రూ.50వేలు, వాలీబాల్ జట్టుకు రూ.30వేలు, పురుషుల బ్యాడ్మింటన్ జట్టుకు రూ.30వేలు, క్రికెట్ జట్టుకు రూ.20వేలు అందచేశారు.

ఆదర్శ ఉద్యోగులకు అభినందన సభ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఫిబ్రవరి 6 : ఆర్టీసీ ఒకటో డిపో పరిధిలో గత మాసంలో ప్రతిభ కనపరిచి అధిక ఆదా యం తీసుకువచ్చిన ముగ్గురు కండక్టర్లకు ఆ డిపో గ్యారేజ్‌లో మంగళవారం అభినందన సభ ఏర్పాటు చేశారు. డీఎం మురళీ కృష్ణ మాట్లాడుతూ ప్రతిభ కనబరిచిన కండక్టర్లు జీజేఎస్ రెడ్డికి రూ.500, ఎస్‌కేపీ రహ మాన్‌కు రూ.400, ఎన్ఎస్ రాయుడుకు రూ.300 నగదు బహుమతులు అందించామన్నారు. ఏసీ విభాగంలో అధిక కేఎం పీఎల్ తీసుకువచ్చిన ఎం మల్లికార్జున్‌కు రూ.500, కే ప్రభాకర్‌కు రూ.300 అందించామన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

నెల్లూరు (వెంకటేశ్వరపురం), ఫిబ్రవరి 6 : బ్యాంకు ఖాతాదారులు సైబర్ మోసాలపై అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలని నెల్లూరు రూరల్ ఎంఈవో అబ్దుల్ హమీద్ సూచించారు. వెంకటేశ్వరపురంలోని టిడ్కో కమ్యూనిటీ భవనంలో ట్రీస్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం స్థానికులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బ్యాంకు ప్రతినిధులమంటూ ఫోన్ చేసి ఓటీపీలు అడిగితే చెప్పవద్దని తెలిపారు. అపరిచితుల ఫోన్‌కాల్స్, మెసేజ్‌లకు స్పందించవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సాఫియా, ముజీర్, ట్రీస్ సంస్థ సభ్యులు నౌరజ్, అహ్మద్, గయాజ్, వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కొత్తూరు ఎన్జీవో లేఅవుట్‌లో ఆక్రమణల తొలగింపు

● భారీగా పోలీసుల మోహరింపు



స్థానికులతో మాట్లాడుతున్న కమిషనర్ వికాస్

నెల్లూరు రూరల్, ఫిబ్రవరి 6 : నెల్లూరు రూరల్‌లోని కొత్తూరు వద్దనున్న ఎన్జీవో లేఅవుట్‌లో ఇటీవల చోటుచేసుకున్న ఆక్రమణలను మున్సిపల్, పోలీసు శాఖలు సంయుక్తంగా మంగళవారం తొలగించాయి. ఇందుకోసం భారీగా పోలీసులను మోహరించి ఆందోళనలకు తావులేకుండా తొలగింపును పూర్తి చేశారు. ఇక్కడున్న స్థలాన్ని భవిష్యత్ అవసరాలకు, ప్రజా ప్రయోజనాల కోసం కేటాయించామని కమిషనర్ తెలిపారు. ప్రజలు వాస్తవాలను అర్థం చేసుకుని ఆక్రమణలకు పూనుకోకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో సిటీ డీఎస్పీ శ్రీనివాసులురెడ్డి, సిటీ ప్లానింగ్ అధికారి దేవి కుమారి పాల్గొన్నారు. కాగా, నగరంలోని 200 ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా ఇప్పటికే 50 ప్రాంతాల్లో వాటిని అమర్చినట్లు కమిషనర్ చెప్పారు. మిగిలిన ప్రాంతాల్లో పనులు త్వరగా పూర్తి చేయాలని యంత్రాంగాన్ని ఆదేశించారు. ఇదిలా ఉండగా నగర మేయర్ స్రవంతి 31వ డివిజన్ రామకోటయ్య నగర్ వద్ద రూ.46 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా నిర్మాణాలు చేపట్టినట్లు తెలిపారు.

మున్సిపల్ కార్మికుల సమ్మె ఒప్పందాల జీవో ఏది..?

● కలెక్టరేట్ ఎదుట కార్మికుల ధర్నా



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 6 : మున్సిపల్ కార్మికుల సమ్మె సమయంలో ప్రభుత్వం ప్రకటించిన ఒప్పందాలకు సంబంధించి జీవోలు విడుదల చేయాలని కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఏపీ మున్సిపల్స్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెంచల నర్సయ్య మాట్లాడారు. సమ్మె కాలంలో జరిగిన చర్చల్లో కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని మంత్రులు, అధికారుల బృందం రాత పూర్వకంగా హామీ ఇచ్చిందన్నారు. వాటికి సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులివ్వాలని కోరారు. యూనియన్ అధ్యక్షురాలు కామాక్షమ్మ మాట్లాడుతూ సమ్మె విరమించిన మూడు రోజులకే జీవోలు విడుదల చేస్తామని చెప్పి నేటికీ ఆ జీవోలు ఇవ్వలేదని ఆరోపించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జీవోలు విడుదల చేయకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు కిన్నెర కుమార్, యూనియన్ నగర అధ్యక్ష, కార్యదర్శులు సునీల్, అశోక్, దేశమూర్తి, లోకేష్, కొండమ్మ, వజ్రమ్మ, రాము, బాలు, శ్రీను, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉన్నత విద్య, ఉపాధిపై సదస్సు

నెల్లూరు (విద్య), ఫిబ్రవరి 6 : ఉన్నత విద్య, ఉపాధి అవకాశాలపై బుధవారం నగరంలోని కృష్ణచైతన్య డిగ్రీ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఆర్‌వీ కృష్ణారెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు జరిగే ఈ సదస్సుకు ఏపీ స్టేట్ కౌన్సిల్ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్ వైస్ చైర్మన్ ప్రొఫెసర్ రామ్మోహన్‌రావు అతిథిగా హాజరవుతున్నారన్నారు. విద్యార్థులకు అవగాహన కల్పించడంతోపాటు సందేహాలను నివృత్తి చేస్తారని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

విద్యావేత్తలకు ఎంపీ సీట్లు ఇవ్వాలి

దళిత సంఘాల గౌరవాధ్యక్షుడు అల్లం రాజా

నెల్లూరు(హరనాథపురం), ఫిబ్రవరి 6 : వచ్చే ఎన్నికల్లో విద్యావేత్తలకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పార్లమెంటు సీట్లు ఇవ్వాలని దళిత సంఘాల గౌరవాధ్యక్షుడు అల్లం రాజా కోరారు. మంగళవారం నగరంలోని గాంధీబొమ్మ సెంటర్‌లో దళిత సంఘాల సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ పార్లమెంటులోనే చట్టాలు తయారవుతాయని, విద్యావేత్తలు పార్లమెంటుకు అవసరమన్నారు. రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి తమ మద్దతు ఉంటుందన్నారు. ఆయన వెంటే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నాయకులు నడుస్తారన్నారు. ఈ సమావేశంలో దళిత సంఘాల నాయకులు పీ మురళి, మోహన్ పాల్గొన్నారు.

బాలల హక్కులపై సదస్సు

నెల్లూరు (విద్య), ఫిబ్రవరి 6 : నగరంలోని ఈఎస్ఆర్ఎం ఉన్నత పాఠశాలలో మంగళవారం ప్రజాసత్తా ఆధ్వర్యంలో బాలల హక్కులు, చట్టాలు, బాలికల సంరక్షణ సదస్సు నిర్వహించారు. నెహ్రూ యువ కేంద్రం సమన్వయకర్త మహేంద్రరెడ్డి మాట్లాడుతూ బాల, బాలికలు విద్య, క్రమశిక్షణ, మంచి అలవాట్లతో ఉన్నతంగా ఎదగాలన్నారు. గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌పై సంబంధిత ఉపాధ్యాయులు విద్యార్థినులకు తెలియచేయాలన్నారు. అనంతరం 1098 చైల్డ్ హెల్ప్‌లైన్ గురించి, బాలల హక్కుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన సంక్షేమ శాఖ మేనేజర్ శ్రీనివాసులు, బాలల సంరక్షణ అధికారి సమత, ప్రజాసత్తా అధ్యక్షుడు శోభన్ బాబు, రాష్ట్ర కార్యదర్శి దువ్వూరు ప్రసాద్, ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ చింతల దయాకర్, ప్రధానోపాధ్యాయుడు ఎస్ శివరామ్ ప్రసాద్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా సురేష్‌బాబు

నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 6 : కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా జిల్లాకు చెందిన లేళ్లపల్లి సురేష్‌బాబును పార్టీ అధిష్ఠానం మంగళవారం నియమించింది. సురేష్‌బాబు నియమకంపై పార్టీ జిల్లా అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

'డీకేడబ్ల్యూ'లో కేన్సర్‌పై అవగాహన

నెల్లూరు (విద్య), ఫిబ్రవరి 6 : నగరంలోని డీకే ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం బ్రెస్ట్ కేన్సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్త్రీలలో వచ్చే కేన్సర్ రకాలు, వాటి నిర్ధారణ, వైద్య సదుపాయాల గురించి ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ లలిత షిర్డీషా వివరించారు. విద్యార్థి దశ నుంచి తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. అనంతరం విద్యార్థినుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ డీ గిరి, విశ్రాంత ఆంగ్ల అధ్యాపకురాలు ఏ భారతి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్స్ పీ ఉమా మహేశ్వరి, కే నాగరాజు, వై దివ్య, పీఆర్వో జోజి పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి




ప్రజలతో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ అల్తాఫ్

నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 6: ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ప్రతి ఒక్కరు సహకరించాలని దర్గామిట్ట ఇన్‌స్పెక్టర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ ప్రజలను కోరారు. ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో మంగళవారం రాత్రి టెక్కేమిట్ట పరిసర ప్రాంతాల్లోని ప్రజలకు ఎన్నికల నిర్వహణపై అవగాహన కల్పించారు. ఇప్పటికే రౌడీషీటర్లు, ట్రబుల్ మాంగర్స్, గత ఎన్నికల్లో కేసులు నమోదైన వారిని బైండోవర్ చేస్తున్నామని చెప్పారు. తమ ప్రాంతాల్లో చట్ట వ్యతిరేక కార్యక్రమాలు జరుగుతుంటే డయల్ 112, 94407 96308 నెంబర్లకు సమాచారం అందిస్తే తగిన చర్యలు తీసుకుంటామని ప్రజలకు సూచించారు. కాగా, దర్గామిట్ట స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ బదిలీపై వెళుతున్న ఎస్ఐలు బీ రమేష్‌బాబు, సుబ్రహ్మణ్యం, వెంకటాద్రినాయుడును స్టేషన్ ఇన్‌స్పెక్టర్, సిబ్బంది ఘనంగా సత్కరించారు.

వెంకన్న హుండీకి మరో టోకరా


తిరుపతి టౌన్ బ్యాంకులో రూ.10కోట్లు డిపాజిట్ చేసిన టీటీడీ



శ్రీవారి నిధులను ఇష్టారాజ్యంగా వాడేస్తున్నారన్న విమర్శల నేపథ్యంలో డిపాజిట్ల రూపంలో మరో వ్యవహారం వెలుగులోకి వచ్చింది. తిరుపతి కోఆపరేటివ్ టౌన్ బ్యాంకులో రూ.10 కోట్లను గుట్టుచప్పుడుకాకుండా టీటీడీ డిపాజిట్ చేసింది.రెండు రోజుల క్రితం టీటీడీ ఖజానా నుంచి 13నెలలకు తిరుపతి టౌన్ బ్యాంకుకు నిధులు డిపాజిట్ చేసినట్టు విశ్వసనీయంగా తెలుస్తోంది. దీనికి సంబంధించిన డిపాజిట్ బాండ్లను కూడా టీటీడీకి టౌన్‌బ్యాంకు అందజేసినట్టు సమాచారం. టీటీడీ నియమ నిబంధనల మేరకు మిగులు మొత్తాలను ఎక్కువ వడ్డీ ఇచ్చే జాతీయ బ్యాంకులో మాత్రమే డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వం ఆమోదించిన ప్రైవేట్ రంగ బ్యాంకులు కొటేషన్లు సమర్పించే అర్హత పొందడానికి అత్యధిక క్రెడిట్ రేటింగ్ కలిగివుండాలి. కేంద్ర ప్రభుత్వ లేదా రాష్ట్ర ప్రభుత్వ సెక్యూరిటీలలో పెట్టుబడి పెట్టకూడదని టీటీడీ పాలకమండలి ఇదివరకే తీర్మానించింది. 2022లో టీటీడీ విడుదలచేసిన శ్వేతపత్రం మేరకు దాదాపు రూ.1600 కోట్లు నగదు రూపంలో వివిధ జాతీయ బ్యాంకుల్లో డిపాజిట్ల రూపంలో వున్నాయి. డిపాజిట్ చేయదలుచుకున్న జాతీయ బ్యాంకు ఎంత వడ్డీ ఇస్తుందో తెలియజేస్తూ సీల్డుకవర్‌లో కొటేషన్ పంపాలి. టీటీడీ ట్రస్టు అనుమతితో అధిక వడ్డీ ఇచ్చే జాతీయ బ్యాంకుల్లో డిపాజిట్ చేస్తుంటారు. టీటీడీ ఇప్పటివరకు ఎస్బీఐ, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు, విజయ బ్యాంకు, ఆంధ్రా బ్యాంకు, ఇండియన్ బ్యాంకు, బ్యాంక్ ఆఫ్ బరోడా వంటి బ్యాంకుల్లో డిపాజిట్ చేసినట్టు తెలిసింది. అయితే పాలకమండలి ముఖ్యనేత నోటి మాట చెప్పారని రూ.10కోట్లు ఒక్క క్లిక్‌తో టౌన్‌బ్యాంకులో డిపాజిట్ చేసేశారు. రూ50 కోట్లు అడిగితే తొలివిడతగా 8.5 శాతం వడ్డీ రేటుతో రూ.10కోట్లు జమచేశారు. ఇప్పటివరకు సహకార బ్యాంకుల్లో శ్రీవారి నిధులు డిపాజిట్ చేసిన దాఖలాల్లేవు. ఎన్నికలవేళ నగరంలో మహిళలకు భారీగా రుణాలు ఇచ్చేందుకే ఈ నిధులు వినియోగిస్తారని ప్రచారం జరుగుతోంది. ఎన్నికల ఏడాది కాబట్టి రుణగ్రహీతలు తిరిగి చెల్లించకపోతే టౌన్‌బ్యాంకుపై భారం పడకతప్పదు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత టౌన్‌బ్యాంకు భవితవ్యంపై నీలినీడలు కమ్ముకున్నాయి. కొత్త పాలకమండలి వచ్చిన తర్వాత దాదాపు రూ.15కోట్లు డిపాజిట్‌దారులు వెనక్కి తీసుకున్నట్టు సమాచారం.

- తిరుపతి,ఆంధ్రజ్యోతి

ఖర్చుకు సిద్ధమా...?



'ఆహ నా పెళ్లంట సినిమాలో బ్రహ్మానందంలా ఉంది మా పరిస్థితి' అంటూ వాపోతున్నారు నగరి నియోజకవర్గంలోని వైసీపీ నాయకులు. సీఎం జగన్ అనంతపురంలో నిర్వహించనున్న సిద్ధం సభకు తరలించాల్సిన జనసంఖ్య నియోజకవర్గాలవారీగా ఖరారైంది. 5నుంచి 10వేల మందిని నగరి నుంచి తరలించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా మంగళవారం నగరిలో వైసీపీ నాయకులతో మంత్రి రోజా నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. ఒక్కో స్థానిక నాయకుడు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధి కనీసం 50 మందిని అనంతపురం సభకు తరలించాలని లక్ష్యాన్ని నిర్దేశించారు. సభకు వెళ్లేందుకు బస్సు సౌకర్యం మాత్రం పార్టీ ఏర్పాటు చేస్తుందని, సభకు వచ్చే వారికి అయ్యే ఖర్చులు ఆయా నాయకులే భరించుకోవాలని తేల్చి చెప్పేశారు.ఈ మాట వినగానే నాయకులు ఒకరి ముఖాలు మరొకరు చూసుకున్నారు. 'అధికారంలోకి వచ్చి ఐదేళ్లు పూర్తవుతోంది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పెట్టిన ఖర్చులకు కనీసం వడ్డీకి సరిపడా కూడా సంపాదించుకోలేకపోయా' అని ఒక నాయకుడు వాపోయాడు. 'సరేలే భలే చెప్పావులే అన్నా... కౌన్సిలర్ ఎలక్షన్లలో రూ.20 లక్షలు ఖర్చయింది. కనీసం వార్డులో డ్రైనేజీ నిర్మించే పని కూడా చేసుకోలేకపోయాను' అంటూ మరో కౌన్సిలర్ కం నాయకుడు నిట్టూర్చాడు. 'ఎక్కడో అనంతపురానికి అధినేత వస్తే మనం ఖర్చులు భరించి, జనాన్ని తీసుకువెళ్లడం ఏమిటి? పెద్ద నాయకుల పుట్టినరోజులు వస్తే వార్డుల్లో, గ్రామాల్లో వేలకు వేలు ఖర్చులు పెట్టి ఫ్లెక్సీలు కట్టాలి.. నియోజకవర్గంలో మీటింగ్ అంటే జనాన్ని తోలాలి... పల్లెనిద్ర, గడప గడపకు అంటే రూ.లక్షలు ఖర్చు. ఎందుకు జగనే కావాలి అనే కార్యక్రమానికైతే చేతి చమురు వదిలింది. వడ్డీలు కట్టుకోవడం తప్ప రూపాయి సంపాదన లేదు.' అని చేతి చిల్లు వదిలిన మరొకరు భోరుమన్నారు. మంత్రి ముందు నోరెత్తకపోయినా ఒకరికొకరు మాత్రం తమ కష్టాలు కడుపుచించుకుని పంచుకున్నారు.

-పుత్తూరు అర్జున్

కదిలొచ్చిన జనం



సభలో ప్రసంగిస్తున్న చంద్రబాబు

- ఎండను లెక్కచేయని వైనం
- గంటపాటు సాగిన చంద్రబాబు ప్రసంగం
- ఆసక్తిగా విన్న సభికులు
- వైసీపీ నేతల అవినీతిని ప్రస్తావించగానే కేకలతో స్పందన
- జీడీనెల్లూరులో 'రా కదలిరా' విజయవంతం

చిత్తూరు, ఆంధ్రజ్యోతి

'రా.. కదలిరా' అన్న టీడీపీ పిలుపునకు జనం స్పందించారు. చిత్తూరు జిల్లా గంగాధరనెల్లూరు సమీపం రామానాయుడుపల్లె వద్ద మంగళవారం నిర్వహించిన చంద్రబాబు సభకు కదిలొచ్చారు. జిల్లా నలుమూలల నుంచీ టీడీపీ శ్రేణులూ తరలివచ్చారు. షెడ్యూల్ మేరకు మధ్యాహ్నం 3 గంటలకు చంద్రబాబు వస్తారని తెలిసినా ఉదయం 9 గంటల నుంచే సభా ప్రాంగణం నాయకులు, కార్యకర్తలతో సందడిగా మారింది. 12 గంటలకంతా కార్యకర్తలు, మహిళలు, జనం పెద్దఎత్తున చేరుకున్నారు. ఎండ తీవ్రంగా ఉన్నప్పటికీ లెక్కచేయలేదు. షెడ్యూల్ మేరకు చంద్రబాబు సభాప్రాంగణం సమీపంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు వచ్చారు. అప్పటికే వేదికపై టీడీపీ నాయకులు దొరబాబు, షాజహాన్, హేమలత, పీఎస్ మునిరత్నం, రాజన్, సప్తగిరి ప్రసాద్, జనసేన ఇన్‌చార్జి పొన్న యుగంధర్ తదితరులు ప్రసంగించారు. చంద్రబాబు వేదిక మీదకు వచ్చాక అమరనాథరెడ్డి, పులివర్తి నాని, డాక్టర్ థామస్ మాట్లాడారు. సాయంత్రం 4 నుంచి ఐదు గంటల వరకు.. సుమారు గంటపాటు చంద్రబాబు ప్రసంగం సాగింది. ఈ ప్రసంగాన్ని శ్రేణులు, మహిళలు ఆసక్తిగా విన్నారు. జిల్లా నాయకుల అవినీతి, అక్రమాల గురించి చంద్రబాబు చెప్పేటప్పుడు జనం కేకలతో ప్రతిస్పందించారు. థామస్‌ను గెలిపించాలని చంద్రబాబు కోరినప్పుడు సభికులు విశేషంగా స్పందించారు. సభా ప్రాంగణం నిండిపోయి పక్కనే ఉన్న పుత్తూరు-చిత్తూరు ప్రధాన రహదారి కూడా ప్రజలతో కిక్కిరిసింది. రామానాయుడుపల్లె వేదిక స్థలం నుంచి అటు జీడీనెల్లూరు వరకు ఇటు కొత్తపల్లిమిట్ట వరకు కార్యకర్తలు వచ్చిన వాహనాలు ఆగిపోయాయి. 5 గంటలకు చంద్రబాబు ప్రసంగం పూర్తయ్యాక వేపంజేరి మాజీ ఎమ్మెల్యే ఆర్ గాంధీ టీడీపీలో చేరారు. ఆయనకు చంద్రబాబు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. డీకే ఆదికేశవులు కుమార్తె తేజస్విని వేదిక మీద చంద్రబాబును కలిశారు. 5.30 గంటలకు చంద్రబాబు హెలికాప్టర్ బయల్దేరిన తర్వాత గంటకుపైగా ట్రాఫిక్ స్తంభించింది. నగరి, పూతలపట్టు ఇన్‌చార్జులు గాలి భానుప్రకాష్, మురళి, మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్‌వర్మ తదితరులు పాల్గొన్నారు. ఇక, చిత్తూరు నగర సమీప ఠాణా వద్ద గురజాల జగన్మోహన్ ఆధ్వర్యంలో 15 వేల మందికి భోజనాలు ఏర్పాటు చేశారు.

వైసీపీ ఆఫీసులో ఫొటోలు తీశారని ఇద్దరు జనసేన కార్యకర్తలపై కేసు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 6: ఎన్నికలు సమీపిస్తున్న వేళ రాజకీయ పార్టీల మధ్య విభేదాలు ముదిరిపోతున్నాయి. వీడియోలు, ఫొటోలతో ఒకరినొకరు ట్రోలింగ్ చేసేందుకు ఎత్తుకుపైఎత్తులు వేస్తున్నారు.శ్రీకాళహస్తి వైసీపీ ఆఫీసులో ఫొటోలు, వీడియోలు చిత్రీకరించారంటూ ఇద్దరు జనసేన కార్యకర్తలపై పోలీసులు కేసు నమోదు చేశారు. వన్‌టౌన్ సీఐ నరసింహారావు కథనం మేరకు.. శ్రీకాళహస్తి పట్టణం ఓటేరు కాలువకు చెందిన దినేష్, పీవీ రోడ్డు ప్రాంతానికి చెందిన గోపి జనసేన కార్యకర్తలు. సోమవారం మధ్యాహ్నం అనుమతి లేకుండా వైసీపీ కార్యాలయంలో ప్రవేశించి ఫొటోలు తీశారని, వీడియో చిత్రీకరించారని అక్కడ పనిచేసే రామసుబ్బమ్మ ఫిర్యాదు చేయగా అక్రమంగా చొరబడడం, దుర్భాషలాడటంపై కేసు నమోదు చేశారు.

రీల్స్‌కోసం వెళ్లాం

సామాజిక మాధ్యమాల్లో రీల్స్ పోస్టు చేసేందుకు వెళితే కేసులో ఇరికించారని దినేష్ చెబుతున్నాడు. 'నా పేరు దినేష్ వైసీపీ సిద్ధం నినాదానికి ప్రతిగా జనసేన తరపున సిద్ధం రీల్స్ చేస్తున్నాం.ఇందుకోసం స్నేహితుడైన ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన గోపీతో కలిసి వైసీపీ ఆఫీస్ వద్ద రోడ్లో రీల్స్ కోసం వీడియోలు తీసుకున్నాం. నేను ఆఫీస్ వెలుపలే ఉన్నా. నా ఫోన్‌తో గోపి వైసీపీ ఆఫీసులో తెలిసిన వారితో మాట్లాడి వస్తానని లోనికి వెళ్ళాడు.మధ్యలో సీఎం జగన్ చిత్రపటాన్ని గోపి వీడియో తీస్తుండగా కొందరు వైసీపీ కార్యకర్తలు గోపీని పట్టుకున్నారు. నా ఫోన్‌పై జనసేన స్టిక్కర్ ఉండడంతో మా పార్టీ నేతల సూచనతో వీడియో తీసేందుకు వచ్చానని గోపీని బలవంతంగా ఒప్పించి దాన్ని వీడియోగా చిత్రీకరించుకున్నారు. ఆ తర్వాత గోపితో పాటు నాపై కూడా ఫిర్యాదు చేసి కేసు నమోదు చేయించారు. నా ఫోనును పోలీసులు సీజ్ చేశారు' అంటూ ఆవేదన వ్యక్తం చేశాడు.

వైసీపీ నాయకుడి ఇంట్లో 38 ఓట్లు

- ఓ కార్పొరేటర్ ఓటు కూడా అక్కడే

తిరుపతి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఒక ఇంట్లో ఐదారు ఓట్లుండడం సహజం. పది ఓట్లుంటే రెండు పోర్షన్లలో ఉంటారులే అనుకోవచ్చు. కానీ ఏకంగా 38 ఓట్లుంటే వాటిని కచ్చితంగా దొంగ ఓట్లనే అంటారు.తిరుపతి నగరం జీవకోన ప్రాంతంలోని డోర్ నెంబరు 21-11-297 వైసీపీ సేవాదళ్ రీజనల్ కోఆర్డినేటర్ తలారి రాజేంద్రకు చెందిన ఇల్లుగా తెలుస్తోంది. ఇదే డోర్‌నెంబరు పక్కన ఏ, బీ, సీలు చేర్చి ఏకంగా 38 ఓట్లను చేర్చారు. తిరుపతి నియోజకవర్గానికి సంబంధించిన ఓటర్ల జాబితాలో తవ్వేకొద్దీ దొంగ ఓట్లు బయటపడుతున్నాయి. గత ముసాయిదా జాబితాలోనూ తప్పులను సరిచేయాలని బీఎల్వోలకు ఫిర్యాదు చేసినా ఫలితంలేదు. స్థానిక నాయకుల ఒత్తిడిమేరకే నకిలీ ఓట్లను తొలగించకుండా వదిలేయడం వలన తుది జాబితాలోనూ అవే ఓట్లు వెలుగుచూశాయి. 3వ డివిజన్ లక్ష్మీపురం ప్రాంతానికి చెందిన వైసీపీ కార్పొరేటర్ గణేష్ కుమార్ ఓటు కూడా ఇదే డోర్ నెంబరులో కనిపిస్తోంది. ఒకే ఇంటి చిరునామాతో ఉన్న ఓటర్లందరూ నకిలీ అని టీడీపీ నేత కంకణాల రజనీకాంత్ మున్సిపల్ కమిషనర్ అదితి సింగ్‌కు ఫిర్యాదు చేయగా ఆమె విచారణకు ఆదేశించినట్టు తెలుస్తోంది. అదే విధంగా శెట్టిపల్లిలోని (పోలింగ్ స్టేషన్ 238) గ్రౌండ్ ఫ్లోర్ ఉన్న ఇంటికి మూడంతస్తుల భవనం ఉన్నట్టు చూపించి 23 దొంగ ఓట్లను చేర్చారు. ఇది గమనించిన టీడీపీకి చెందిన బీఎల్ఏ మోహన్ సంబంధిత బీఎల్వోలకు ఫిర్యాదుచేసినా స్పందన లేకపోవడంతో మంగళవారం టీడీపీ నగర అధ్యక్షుడు చినబాబుతో కలసి కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు





ఒకే ఇంటినెంబరుతో ఉన్న దొంగ ఓట్ల జాబితా

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

కుక్క దాడిలో చిన్నారులకు గాయాలు


గాయపడిన చిన్నారి మానస

వెంకటగిరి టౌన్, ఫిబ్రవరి 6: మండల పరిధిలోని పంజాం హరిజనవాడలో మంగళవారం వీధి కుక్క దాడిలో ఇద్దరు చిన్నారులకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు... ఆరుగురు చిన్నారులు వీధిలో ఆడుకుంటుండగా ఓ కుక్క హఠాత్తుగా వచ్చి దాడి చేసింది. మాలతి, మానస అనే ఇద్దరు చిన్నారులకు తీవ్ర గాయాలు కావడంతో వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. వీధి కుక్కలు, కోతులు ఎక్కువగా ఉన్నాయని అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధి కుక్కలు, కోతుల బెడద నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

టీడీపీతోనే మహిళా సాధికారత


భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో పాశిం సంధ్యారాణి, మహిళలు

గూడూరు, ఫిబ్రవరి 6: టీడీపీతోనే మహిళా సాధికరత సాధ్యమవుతుందని మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ సతీమణి సంధ్యారాణి అన్నారు. మంగళవారం స్థానిక సాధూపేటలో బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసీపీ రాష్ట్రంలో సాగిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు వివరిస్తున్నామన్నారు. వైసీపీ ప్రభుత్వ అరాచక పాలనతో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మహిళల అభ్యున్నతికి పాటుపడేది టీడీపీనే అని అన్నారు. మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు చంద్రబాబునాయుడు డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేసి అండగా నిలిచారని గుర్తు చేశారు. టీడీపీ అధికారంలోకి వస్తే మహాశక్తి పథకం ద్వారా మహిళలకు అనేక సంక్షేమ, అభివృద్ధిపథకాలను అమలు పరిచేలా మినీమెనిఫెస్టోను రూపొందించడం జరిగిందన్నారు. వీటిపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, పులిమి శ్రీనివాసులు, నరసింహులునాయుడు, చంద్రమౌళి, మోహన్, శ్రీధర్, రమేష్, రత్నం, బిల్లు చెంచురామయ్య, ఆరికట్ల మస్తాన్‌నాయుడు, రవీంద్రరెడ్డి, మట్టం శ్రావణి, ప్రమీల, శైలజ తదితరులు పాల్గొన్నారు.

సమ్మెకాలపు ఒప్పంద జీవోలు విడుదల ఇవ్వండి



సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

గూడూరు, ఫిబ్రవరి 6: మున్సిపల్ కార్మికుల సమ్మె కాలపు ఒప్పంద జీవోలను వెంటనే జారీ చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేయడం జరిగిందన్నారు. పోరాటం విరమించి నెలరోజులు కావస్తున్న జీవోలను జారీ చేయడంలో ప్రభుత్వం అలసత్వాన్ని ప్రదర్శిస్తోందన్నారు. సమ్మె ముగింపురోజు జరిగిన ఒప్పందాల ప్రకారం జీవోలను రెండోరోజుల్లో జారీ చేస్తున్నామని మంత్రులు, అధికారులు హామీ ఇచ్చారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణమే జీవోలను విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో రమేష్, కోటేశ్వరరావు, పెంచలప్రసాద్, మురళి, ప్రభావతి, సంపూర్ణమ్మ, శివకుమార్, బీవీరమణయ్య, సురేష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నిమ్మ సాగులో చీడపీడల నివారణపై అవగాహన


నిమ్మ చెట్లలో చీడపీడల గురించి రైతుకు వివరిస్తున్న అధికారి కార్తీక్

గూడూరు, ఫిబ్రవరి 6: నిమ్మసాగులో చీడపీడల నివారణపై మండలంలోని పారిచెర్ల గ్రామంలో రైతులకు ఉద్యానశాఖ అధికారి కార్తీక్ అవగాహన కల్పించారు. ప్రస్తుతం వాతావరణ పరిస్థితుల కారణంగా నిమ్మచెట్లలో రసం పీల్చే పురుగులు, తెల్లదోమల తాకడి ఉధృతంగా ఉందన్నారు. నిమ్మచిగుర్లకు జిగురుపట్టి ముడుచుకోవడం జరుగుతుందని, దీంతో చెట్లల్లో ఎగుదల క్షీణిస్తుందన్నారు. దీని నివారణకు తీసుకోవాల్సి చర్యల గురించి వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది శివ, రైతులు పాల్గొన్నారు.

వల్లివేడులో పొలంబడి


రైతులకు సలహాలు ఇస్తున్న ఏడీఏ నాగర్జున సాగర్

వెంకటగిరిటౌన్, ఫిబ్రవరి 6: మండల పరిధిలోని వల్లివేడు గ్రామంలో మంగళవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఏడీఏ నాగర్జున సాగర్ మాట్లాడుతూ పురుగుల నిష్పత్తిని అనుసరించి యాజమాన్య పద్ధతులు పాటించాలని రైతులకు సూచించారు. రాత్రి ఉష్ణోగ్రతలు తక్కువగా ఉన్నందున అగ్గి తెగులు సోకే ప్రమాదం ఉందని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ వరప్రసాద్, సుజాత, రామ్మోహన్, భాస్కర్, శివ, రేఖ, వరలక్ష్మి, శ్రీప్రియ, సుమతి, రాజ్యలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

ఎన్‌బీకేఆర్‌లో పరిగ్రాహ్‌2కే-24

కోట, ఫిబ్రవరి 6: మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో మార్చి 4వ తేదీన పరిగ్రాహ్‌2కే-24 జాతీయస్థాయి సాంకేతిక సదస్సు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి పోస్టర్లను మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయ కుమార్‌రెడ్డి, ఆయా విభాగాధిపతులు డాక్టర్ శ్రీనివాస్, సందీప్‌కుమార్, డాక్టర్ పీవీ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డైరెక్టర్, విభాగాధిపతులు

3టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం


రేషన్ బియ్యాన్ని పరిశీలిస్తున్న అధికారులు

వెంకటగిరిటౌన్, ఫిబ్రవరి 6: పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీ వద్ద సయ్యద్ జావిద్ అనే వ్యక్తి ఇంట్లో 3టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు సీఎస్ డీటీ సంధ్యారాణి మంగళవారం తెలిపారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని ఎమ్మెల్‌ఎస్ పాయింట్‌కు తరలించామని తెలిపారు. నిందితుడిని పోలీసులకు అప్పగించి ఫిర్యాదు చేశామని చెప్పారు. కార్యక్రమంలో విజిలెన్స్ డీఎస్పీ విజయకుమార్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభం ఏర్పాటు చేయండి


వేలాడుతున్న విద్యుత్ తీగలకు ఆధారంగా కర్ర

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 6: మండల పరిధిలోని దేగవారికండ్రిగ నుంచి ఉగ్గుముడి గ్రామానికి వెళ్లే రోడ్డు మార్గంలో ఉన్న విద్యుత్ తీగలు తక్కువ ఎత్తులో వేలాడుతున్నాయి. పెద్దపెద్ద వాహనాలకు విద్యుత్ తీగలు తగిలేలా ఉండడంతో భయంభయంగా వెళ్లాల్సి వస్తోంది. వారం రోజుల కిత్రం ఓ మిని లారీకి విద్యుత్ తీగలు తగిలి తెగిపోయాయి. అదృష్టవశాత్తు ఎటువంటి ప్రమాదం జరగలేదు. ఈ విషయాన్ని సంబంధిత అధికారులకు చెప్పినా పట్టించుకోలేదు. దీంతో గ్రామస్తులే కర్రలను ఊతంగా నిలబెట్టి వేలాడే విద్యుత్ తీగలు ఎత్తులో ఉండేలా సరిచేశారు. విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి స్తంభం ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఉపాధి పనులపై బహిరంగ విచారణ

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 6: సూళ్లూరుపేట మండలంలోని 19 పంచాయతీల్లో జరిగిన ఉపాధి పనులపై మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ ఆధ్వర్యంలో బహిరంగ విచారణ చేపట్టారు. మండలంలో మొత్తం రూ.8 కోట్ల మేర పనులు జరిగాయి. ఇందులో రూ.1.30 లక్షల మేర పనులు సక్రమంగా జరగలేదని తేలడంతో ఖర్చుపెట్టిన నిధులను రికవరీకి ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రమౌళి, ఏపీవో నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడి మృతి

చిల్లకూరు, ఫిబ్రవరి 6: రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.... అసోం రాష్ట్రానికి చెందిన జనెజ్ అల్లీ అనే యువకుడు పున్నపువారిపాళెం గ్రామ సమీపంలోని ఓ రొయ్యల పరిశ్రమలో పనిచేసేవాడు. రెండు రోజుల క్రితం బైక్‌పై గూడూరుకు వచ్చి తిరిగి వెళుతుండగా మండలంలోని వరగలి క్రాస్‌రోడ్డు సమీపంలో కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో జనెజ్ అల్లీ తీవ్రంగా గాయపడడంతో గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. మంగళవారం మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తీసుకెళ్తుండగా మార్గం మధ్యం మృతిచెందాడు.

రవాణరంగ కార్మికుల సమ్మెను విజయవంతం చేయండి

గూడూరు, ఫిబ్రవరి 6: రవాణరంగ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 16వ తేదీన సీఐటీయూ, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ ఆటో సంఘం నాయకుడు బీవీ రమణయ్య పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆటో కార్మికుల సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం తీసుకువస్తున్న మోటారు వెహికల్ యాక్ట్ వెంటనే రద్దుచేసి రవాణరంగ కార్మికులను ఆదుకోవాలన్నారు. హిట్ అండ్ రన్ పేరుతో డ్రైవర్లకు 10 సంవత్సరాల వరకు జైలు శిక్ష, జరిమానా విధించే ప్రమాదకరమైన చట్టాలను రద్దు పరచాలన్నారు. అలాగే నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కోటయ్య, రమేష్, సుధాకర్, రమేష్, రఫీ, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు రోడ్డుకు మోక్షం

తడ, ఫిబ్రవరి 6: మండల కేంద్రమైన తడ బజారువీధిలో శ్రీకాళహస్తి రోడ్డుకు ఎట్టకేలకు మోక్షం లభించింది. ఈ మార్గంలో గోతులు ఏర్పడడంతో సానికులతో పాటు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. అడపాదడపా తూతూమంత్రంగా మరమ్మతులు చేసి వదిలేసేవారు. దీంతో ఆ రోడ్డు ఎప్పుడు చూసినా గోతులుమయంగా ఉండేది. దీంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పేవికావు. పైగా ప్రమాదాలు సైతం జరిగేవి. ఎట్టకేలకు సోమ, మంగళవారాల్లో రోడ్డుకు మరమ్మతులు చేశారు.

ఆమ్‌ఆద్మీ పార్టీ ప్రచారం


ప్రచారం చేస్తున్న ఆమ్‌ఆద్మీ కార్యకర్తలు

నాయుడుపేట, ఫిబ్రవరి 6: నాయుడుపేటలో ఆమ్‌ఆద్మీ పార్టీ నాయకులు మంగళవారం ప్రచారం నిర్వహించారు. ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పాలేటి వెంకటస్వామి ఆధ్వర్యంలో ఇంటింటా పర్యటించి కరపత్రాలు పంపిణీ చేశారు. ఆ కార్యక్రమంలో ఆమ్‌ఆద్మీ పార్టీ మహిళా విభాగం కన్వీనర్ పులి మానస, రాజరాజమ్మ, సంధ్య, మానస తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ గెలుపు కోసం సైనికుల్లా పనిచేయండి: కురుగొండ్ల


సమావేశంలో మాట్లాడుతున్న కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి, ఫిబ్రవరి 6: రానున్న ఎన్నికల్లో టీడీపీ గెలుపు కోసం ప్రతిఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని తిరుపతి రోడ్డు మార్గంలో ఉన్న ఎస్ఆర్ఎల్ కల్యాణ మండపంలో నియోజకవర్గ పరిధిలోని వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి మండలాల క్లస్టర్, బూత్, యూనిట్ ఇన్‌చార్జిలకు నిర్వహించిన ఇంటిగ్రేటెడ్ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. అధికార పార్టీ దొడ్డిదారిన గద్దెనెక్కే ప్రయత్నాలను విఫలం చేసేందుకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని సూచించారు. పార్టీ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ, ఓటర్ వెరిఫికేషన్, సెల్ఫ్ రిజిస్ట్రేషన్, పోల్ మేనేజ్‌మెంట్ తదితర కార్యక్రమాలను కుటుంబ సాధికార సమితి సభ్యులు త్వరితగతిన పూర్తి చేయాలని పేర్కొన్నారు. తెలుగు మహిళ రాష్ట్ర కార్యదర్శి కుమారి, ఐటీడీ తిరుపతి పార్లమెంటు సభ్యుడు యాచేంద్ర, ఓటర్ వెరిఫికేషన్ కోఆర్డినేటర్ వేమయ్య పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. మన టీడీపీ యాప్‌పై చంద్రశేఖర్ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పప్పు చంద్రమౌళిరెడ్డి, శ్రీరామదాసు గంగాధర్, పోలంరెడ్డి కోటేశ్వరెడ్డి, రాయి సత్యం, అవ్వారు సత్యనారాయణ, ఏలేశ్వరం రామచంద్రయ్య, రాయి మస్తాన్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని పరిరక్షించండి


మీడియాతో మాట్లాడుతున్న బీజేపీ నాయకుడు మణి తదితరులు

వెంకటగిరి టౌన్, ఫిబ్రవరి 6: పట్టణంలోని ఎన్‌జేఆర్ సర్కిల్ వద్ద సర్వే నెం. 227.10లో ఉన్న 48సెంట్ల ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని బీజేపీ నేత మణి అన్నారు. మంగళవారం బీజేపీ, జనసేన నాయకులు కలిసి స్థలాన్ని పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ పట్టణ నడిబొడ్డన ఉన్న విలువైన ప్రభుత్వ స్థలంపై ప్రైవేటు వ్యక్తులకు అనుకూలంగా కోర్టు తీర్పు ఇచ్చిందని ఆర్డీవో చెప్పడం దారుణమన్నారు. సదరు భూమిపై కోర్టులో కేసు నడుస్తుండగా ప్రైవేటు వ్యక్తులకు అనుకూలంగా ఆర్డీవో స్థాయి అధికారి మాట్లాడడం సరికాదన్నారు. కోట్లాది రూపాయలు విలువ కలిగిన భూములు అన్యాక్రాంతం అవుతుంటే అధికారులు పట్టించుకోకపోవడంలో ఆంతర్యం ఏమిటని సందేహం వ్యక్తం చేశారు. అదే విధంగా మున్సిపాలిటీ కార్యాలయం వద్ద ఉన్న ప్రభుత్వం స్థలాన్ని కూడా కాపాడాలని కోరారు. కాగా, పట్టణంలో ప్రభుత్వం స్థలాల అన్యాక్రాంతంపై చర్యలు తీసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్‌కు మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ, కౌన్సిలర్లు ఫిర్యాదు చేశారు.

అర్హులందరికీ ఓటు హక్కు కల్పించండి

డక్కిలి, ఫిబ్రవరి 6: అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని కలెక్టరు లక్ష్మీశా బీఎల్‌వోలను ఆదేశించారు. మంగళవారం బీఎల్‌వోలతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. పోలింగ్ కేంద్రాలను పరిశీలించి వసతుల కల్పనలో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా చూడాలన్నారు. వికలాంగులు ఓటు హక్కు వినియోగించుకోవడంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలింగ్ కేంద్రాల్లో ప్లాట్‌ఫామ్‌లు సిద్ధం చేయాలని సూచించారు. ఓటరు నమోదు, సవరణ, పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పన తదితర పనుల నుంచి వలంటీర్లను దూరంగా పెట్టాలని స్పష్టం చేశారు.

యువత భవిష్యత్తే.. బాబు లక్ష్యం: టీడీపీ


గునపాటిపాళెం గ్రామస్తులతో టీడీపీ కన్వీనర్ కిషోర్‌నాయుడు

చిట్టమూరు, ఫిబ్రవరి 6: ఆంధ్రప్రదేశ్ యువత భవిష్యత్తే.. చంద్రబాబునాయుడు లక్ష్యమని టీడీపీ మండల కన్వీనర్ గణపర్తి కిషోర్‌నాయుడు అన్నారు. బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని గునపాటిపాళెం గ్రామంలో పర్యటించారు. స్థానిక నాయకులు, కార్యకర్తలు, మహిళలతో కలిసి ఇంటింటా తిరిగి మహాశక్తి పథకాలను వివరించారు. కార్యక్రమంలో జనార్దన్‌రెడ్డి, సునీల్‌రెడ్డి, రాజేష్‌రెడ్డి, చిన్నారావు, కస్తూరయ్య, చెంచురామయ్య ఆచారి, మోహన్‌రెడ్డి, మణి, ముత్తు దేవుడు, అబ్దుల్, అంకయ్య, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

బంగారంపేట సర్పంచు అరెస్టు


నాగేంద్రప్రసాదరెడ్డిని నల్లపాడు పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

పెళ్లకూరు, ఫిబ్రవరి 6: మండలంలోని బంగారంపేట సర్పంచు, పంచాయతీరాజ్ ఛాంబర్ కార్యనిర్వాహక కార్యదర్శి దేవారెడ్డి నాగేంద్రప్రసాద్ రెడ్డిని మంగళవారం పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం విజయవాడలో రాష్ట్ర సర్పంచుల సంఘం, పంచాయతీ రాజ్ ఛాంబర్ ఆధ్వర్యంలో అసెంబ్లీ వద్ద నిరసన తెలుపుతున్న నాగేంద్రప్రసాద్‌రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకుని గుంటూరు జిల్లా నల్లపాడు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సర్పంచుల నిధులు, విధులు, హక్కులపై శాంతియుతంగా నిరసన తెలుపుతుంటే పోలీసులు అన్యాయంగా అరెస్టు చేశారని అన్నారు.

ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలి


ఆటో డ్రైవర్లకు సూచనలిస్తున్న ఎస్ఐ రవిబాబు

ఓజిలి, ఫిబ్రవరి 6: ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటిస్తూ వాహనాలను నడపాలని ఎస్ఐ రవిబాబు సూచించారు. మంగళవారం ఆయన ఓజిలి బస్టాండు వద్ద ఆటో డ్రైవర్లకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. పరిమితికి మించి ప్రయాణికులను తరలించవద్దని, ప్రమాదాలకు నిలయాలుగా ఉన్న క్రాస్ రోడ్ల వద్ద జాగ్రత్తగా ఆటోలను నడపాలన్నారు. డ్రైవర్లందరూ తప్పనిసరిగా లైసెన్సులు కలిగివుండడంతో యూనిఫారం ధరించాలని స్పష్టం చేశారు.

వైసీపీని గద్దె దించాలి: జనసేన


కరపత్రాలను అందజేస్తున్న జనసేన నాయకులు

గూడూరు, ఫిబ్రవరి 6: రానున్న ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వాన్ని గద్దెదించాలని జనసేన నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక అడివయ్య కాలనీలో జనసేన ఆధ్వర్యంలో ఇంటింట ప్రచారం నిర్వహించి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ రాష్ట్రాన్ని అధోగతి పాలు చేశారని విమర్శించారు. అడివయ్యకాలనీని మున్సిపాలిటీలో కలిపినా ఈ ప్రాంతంలో రహదారులు, తాగునీరు, విద్యుత్‌సౌకర్యం, డ్రైనేజీ కాలువల వంటి అభివృద్ధి పనులు చేపట్టకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో మోహన్, ఇంద్రవర్ధన్ కుమార్, విష్ణు, రాజశేఖర్, రఘు, సనత్‌కుమార్, వసంత్, రసూల్, శివ, వెంకటరమణ, శ్రీనివాసులు, ప్రవీణ్, వాసు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు సభకు తరలిన టీడీపీ శ్రేణులు


రా కదలిరా సభ వద్ద మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం తదితరులు

పెళ్లకూరు, ఫిబ్రవరి 6: చిత్తూరు జిల్లా జీడీ నెల్లూరులో మంగళవారం నిర్వహించిన రా.. కదలిరా.. సభకు పెళ్లకూరు మండలం నుంచి టీడీపీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి వట్టికుండల శేఖర్‌నాయుడు, నాయకులు శ్రీపతిబాబు, దామెర ప్రసాద్‌నాయుడు, కానూరు గోపాల్‌కృష్ణ తదితరులు ప్రత్యేక వాహనాల్లో జీడీ నెల్లూరుకు బయలుదేరి వెళ్లారు.

ఓటర్ల నమోదులో నిష్పక్షపాతంగా వ్యవహరించండి

డక్కిలి, ఫిబ్రవరి 6: ఓటరు నమోదులో బీఎల్‌వోలు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని తహసీల్దార్ శ్రీనివాసుల అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఓటర్ల జాబితా పారదర్శకంగా వుండే విధంగా చర్యలు తీసుకోంటున్నామని చెప్పారు. అన్ని సచివాలయాల్లో ఓటర్ల జాబితాను ప్రదర్శిస్తున్నట్లు వివరించారు. జాబితాపై ఎలాంటి ఫిర్యాదులు వున్నా బీఎల్వోల దృష్టికి తీసుకు వచ్చి తగిన పరిష్కారం పొందాలని సూచించారు. జాబితాలో పేరు లేకున్నా, గ్రామంలో లేనివారి పేర్లు వున్నా, కొత్తగా ఓటు నమోదు చేసుకోవాలన్నా తహసిల్దార్ కార్యాలయంలో సంప్రదించాలని చెప్పారు.

శ్రీహరికోట మెరైన్ సీఐగా శ్రీనివాసరావు



సూళ్లూరుపేట, ఫిబ్రవరి 6: శ్రీహరికోట మెరైన్ సీఐగా శ్రీనివాసరావు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న సీఐ సుబ్బారావు రామాయపట్నానికి బదిలీ అవడంతో ఆయన స్థానంలో ప్రకాశం జిల్లా కొత్తపట్నం సీఐగా ఉన్న శ్రీనివాసరావు వచ్చారు.

ఆంజనేయస్వామి ఆలయాల్లో పూజలు

కోట, ఫిబ్రవరి 6: మండల పరిధిలోని కేశవరం, కోట గ్రామాల్లో ఉన్న ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయాల్లో మంగళవారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఆంజనేయస్వామి మూలవిరాట్‌కు పలు అభిషేకాలు చేసి విశేషంగా అలంకరించారు. భక్తులువచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

ఆర్టీసీ బస్సు బోల్తా: 27 మందికి గాయాలు


బోల్తా పడ్డ బస్సు

తిరుపతి రూరల్, ఫిబ్రవరి 6: ఆర్టీసీ బస్సు బోల్తా పడటంతో 27 మంది ప్రయాణికులు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చిత్తూరు డిపోకు చెందిన బస్సు తిరువణ్ణామలై నుంచి తిరుమలకు వెళుతోంది. సోమవారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో తిరుపతి రూరల్ మండలంలోని వేదాంతపురం సర్కిల్ - రామానుజపల్లె సర్కిల్‌కు మధ్య జాతీయ రహదారిపై వెళుతుండగా ఎదురుగా టిప్పర్ వచ్చింది. దీంతో వాహనాన్ని బస్సు డ్రైవర్ అదుపు చేయబోతుండగా రోడ్డుపక్కకు బోల్తా పడింది. బస్సులో 42మంది ప్రయాణికులు ఉండగా, 27మందికి గాయాలయ్యాయి. బాధితులను 108 అంబులెన్స్‌లో రుయాస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన ఇద్దరిని మాత్రం స్విమ్స్‌కు తీసుకెళ్లారు. బాధితుల్లో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు (భార్యభర్తలు, ముగ్గురు చిన్నారులు) ఉన్నారు. స్వల్ప గాయాలైన వారంతా మంగళవారమే డిశ్చార్జ్ కాగా, ఐదుగురు మాత్రమే ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇరు వాహనాల డ్రైవర్లపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్టు తిరుపతి రూరల్ ఎస్ఐ నాగేంద్రబాబు తెలిపారు.



గాయపడ్డ వారిని అంబులెన్స్‌లోకి ఎక్కిస్తున్న పోలీసులు - సంఘటనా స్థలంలో ప్రయాణికులు